ఆదివారం
31-03-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 279
పేజీలు : 8, వెల: రూ.6.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23

అక్షరాక్షరం అభ్యుదయం

సిరియాపై ఇజ్రాయిల్ దాడి...
42 మంది సైనికుల మృతి

అలెప్పో: హమాస్ అంతమే లక్ష్యంగా గాజాపై తీవ్రస్థాయిలో దాడులు కొనసాగిస్తున్న ఇజ్రాయిల్ తాజాగా సిరియాపైనా విరుచుకుపడింది. అలెప్పో సమీపంలో వైమానిక దాడులు జరిపింది. తీవ్రంగా ప్రాణ, ఆస్తి నష్టం జరిగిందని సిరియా సైనిక వర్గాలు తెలిపాయి. సైనికులతో పాటు పౌరులు కూడా ప్రాణాలు కోల్పోయారని, ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులు ధ్వంసమయ్యాయని అధికార వర్గాలు వెల్లడించాయి. బ్రిటన్‌కు చెందిన సిరియన్ అబ్జర్వేటరీ ఫర్ హ్యూమన్ రైట్స్ సంస్థ తెలిపిన వివరాల ప్రకారం, అలెప్పో సమీపంలో ఇజ్రాయిల్ జరిపిన దాడిలో 42 మంది సైనికులు చనిపోయారు. ఇరాన్ మద్దతుగల హెజ్బుల్లా సిరియాలో ఉండటంతో ఈ దాడులు జరిగినట్లు సమాచారం.

వలంటీర్ల సేవలకు బ్రేక్ !

- ఎన్నికలు ముగిసేవరకు విధులకు దూరం
- సెల్‌ఫోన్లు, ట్యాబ్‌లు స్వాధీనం
- టెట్ ఫలితాలు, ఏపీటీఆర్టీ పరీక్షలు వాయిదా
- ప్రభుత్వ ఉద్యోగుల ద్వారానే పెన్షన్ల పంపిణీ
- కేంద్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి:
వైసీపీ సర్కార్‌కు కేంద్ర ఎన్నికల సంఘం భారీ షాక్ ఇచ్చింది. ప్రజలతో చేరువకావడానికి అత్యంత కీలకంగా ఉపయోగపడుతున్న వలంటీర్లను పూర్తిస్థాయిలో ఎన్నికల విధులకు దూరంగా ఉంచాలని భారత ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకుంది. ప్రతి నెలా 1వ తేదీన వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, ఒంటరి మహిళలు తదితరులకు సామాజిక పింఛన్లు పంపిణీ నేరుగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందజేయడం వలంటీర్ల విధుల్లో అత్యంత కీలకమైంది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అధికారపగ్గాలు చేపట్టగానే ప్రతి 50 కుటుంబాలకు ఒక వలంటీర్, ప్రతి 2 వేల జనాభాకు ఒక సచివాలయం చొప్పున కొత్త వ్యవస్థ ఏర్పాటు చేసిన విషయం తెల్సిందే. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా దాదాపు మూడున్నర లక్షల మంది వలంటీర్లు, లక్షా 20 వేల మంది సచివాలయాలకు రెగ్యులర్ ప్రాతిపదికన ఉద్యోగుల నియామకం చేపట్టారు. వలంటీర్ల నియామకం మాత్రం పూర్తిగా పార్టీకి విధేయులుగా ఉండే వారినే నియమించారు. వీరి ద్వారానే ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలకు లబ్ధిదారులను ఎంపిక చేయడం, వారికి నేరుగా అందేలా చూడటం వంటి కార్యక్రమాలను అధికారులు చేపడుతున్నారు. రేషన్ కార్డు కావాలన్నా, పెన్షన్ కావాలన్నా, ఆరోగ్యశ్రీ, ఆదాయ, కుల ధృవీకరణ పత్రాలు, పాస్‌బుక్ తదితర సమస్త సేవల్లోనూ వలంటీర్లు కీలకంగా వ్యవహరిస్తున్నారు. తమ పరిధిలోని 50 కుటుంబాలకు చెందిన సమస్త సమాచారం కూడా వలంటీర్లకు అందుబాటులో ఉంటుంది. చివరకు ఎవరు ఏ పార్టీకి అనుకూలమో, వారి కుల, మతాలు ఏమిటో కూడా వారి వద్ద డేటా ఉంది. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత కూడా ఏప్రిల్, మే నెలల్లో వరుసగా దాదాపు 65 లక్షల మంది పెన్షన్‌దారులను వలంటీర్లు నేరుగా కలిసి డబ్బు వారి చేతికి అందజేయడమంటే వైసీపీకి ప్రచారం చేయడమేనని, ఓటర్లను ప్రలోభపెట్టే చర్యేనంటూ ప్రతిపక్ష నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో నిష్పాక్షిక ఎన్నికల నిర్వహణ జరగాలంటే వలంటీర్లను విధులకు దూరంగా ఉంచాలని సిటిజన్ ఫర్ డెమోక్రసీ సంస్థ ఎన్నికల కమిషన్‌కు వరుస ఫిర్యాదులు చేసింది. హైకోర్టులోనూ పిటిషన్ దాఖలు చేసింది. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం యథాతథంగానే ఏప్రిల్ 1వ తేదీన వలంటీర్ల ద్వారానే పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయించింది. అలాగే మే 1వ తేదీన కూడా వీరి ద్వారానే పంపిణీ కొనసాగించాలని భావించింది. అయితే పెన్షన్లు పంపిణీ కార్యక్రమంలో వలంటీర్లు ఏ పార్టీకి అనుకూలంగా ప్రచారం చేయకూడదని, ఆదేశాలను ఉల్లంఘిస్తే చర్యలు తీసుకోవల్సి వస్తుందని సెర్ఫ్ సర్క్యులర్ ఒకటి మొక్కుబడిగా

- మిగతా 2 లో

డీఎస్సీ వాయిదా

- టెట్ ఫలితాలకూ బ్రేక్
- ఎన్నికల కోడ్ ముగిశాకే పరీక్షలు
- ఈసీ ఆదేశాలతో నిలిచిన ప్రక్రియ
- నిరుద్యోగులకు నిరాశ

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి:
ఏపీ డీఎస్సీ వాయిదా పడింది. ఎన్నికల కోడ్ ముగిసేంత వరకు డీఎస్సీ వాయిదా వేయాలంటూ కేంద్ర ఎన్నికల కమిషన్(ఈసీ) ఆదేశించింది. ఏపీ టెట్ 2024 ఫలితాలను కూడా ఎన్నికల తర్వాతే ప్రకటించాలని సూచించింది. దీంతో నిరుద్యోగులు తీవ్ర నిరాశకు గురయ్యారు. ఏపీ టెట్‌కు దాదాపు 3 లక్షల మందికిపైగా అభ్యర్థులు ఫలితాల కోసం వేచిస్తున్నారు. అందులో ఇప్పటికే చాలా మంది అర్హత సాధించి, వెయిటేజీ స్కోరు పెంచుకునేందుకుగాను పెద్దఎత్తున టెట్ రాశారు. అదేస్థాయిలో డీఎస్సీ పరీక్షకు దరఖాస్తులు పోటెత్తాయి. 6,100 పోస్టులతో డీఎస్సీ రావడంతో నిరుద్యోగ ఉపాధ్యాయ అభ్యర్థులు ఉత్సాహంగా శిక్షణ ప్రారంభించారు. అదేసమయంలో మరికొందరు ఉపాధ్యాయ

- మిగతా 2 లో

రాయలసీమను
కోనసీమ చేస్తా

- ప్రాజెక్టులు పూర్తి చేసి సస్యశ్యామలంగా మారుస్తా
- ఎన్డీయే కూటమితో జగన్‌లో ఓటమి భయం
- ప్రొద్దుటూరు, శ్రీకాళహస్తి సభలలో చంద్రబాబు

విశాలాంధ్ర –ప్రొద్దుటూరు:
అధికారంలోకి వచ్చాక రాయలసీమను కోనసీమ చేస్తామని, సస్యశ్యామలంగా మారుస్తామని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు హామీనిచ్చారు. సీమ ప్రాజెక్టులను పూర్తి చేస్తామని వాగ్దానం చేశారు. చంద్రబాబు శనివారం ప్రజాగళం యాత్రలో భాగంగా కడప జిల్లా ప్రొద్దుటూరు, తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలో నిర్వహించిన సభలలో మాట్లాడారు. జగన్ ఐదేళ్ల పాలనలో రాయలసీమకు జరిగిన మేలు ఏమిటి? రాయలసీమకు కేటాయించిన నీటి వాటాను తీసుకొచ్చారా అని ప్రశ్నించారు. వనరులు దోచుకోవడం తప్ప ప్రాజెక్టుల పురోగతిని

- మిగతా 2 లో

మంచి చేశా...
ఆదరించండి

బస్సుయాత్రలో జగన్ అభ్యర్థన

విశాలాంధ్ర –తుగ్గలి:
ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి బస్సుయాత్ర కర్నూలు జిల్లాలో కొనసాగింది. మేము సిద్ధం అంటూ జగన్ రాష్ట్రంలో పర్యటిస్తున్నారు. రోడ్‌షోలు, మహిళలు, యువత, మేధావులతో ముఖాముఖి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. బస్సుయాత్ర నాల్గవ రోజు కర్నూలు జిల్లా తుగ్గలి మండలంలో జరిగింది. శనివారం ఉదయం మండలంలోని రాతన, తుగ్గలి, గిరిగేట్ల, జొన్నగిరి, ఎర్రగుడి, చెరువు తండాలలో జగన్ రోడ్ షో నిర్వహించారు. రాతన గ్రామంలో జరిగిన రోడ్ షోలో స్థానిక వైఎస్ఆర్‌సీపీ నాయకులు ఆర్‌వీ మోహన్‌రెడ్డి, ఉమామహేశ్వర్ రెడ్డి, సర్పంచ్ రాచప్ప ఆధ్వర్యంలో క్రేన్‌తో గజమాలను జగన్‌కు వేసి...ఘనస్వాగతం పలికారు. బస్సుయాత్రకు ప్రజలు తండోపతండాలుగా తరలివచ్చారు. ముఖాముఖిలో

- మిగతా 2 లో

ఆప్‌ను వదలని ఈడీ

మద్యం కేసులో మరో మంత్రిని ప్రశ్నించిన ఈడీ

న్యూఢిల్లీ:
దేశ రాజధానిలో మద్యం విధానానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) దర్యాప్తును మరింత వేగవంతం చేసింది. ఈ వ్యవహారంలో ఇప్పటికే ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ కేజ్రీవాల్‌ను కస్టడీలోకి తీసుకున్న ఈడీ... తాజాగా మరో మంత్రికి సమన్లు జారీ చేసింది. ఢిల్లీ మంత్రి కైలాశ్ గెహ్లోత్‌కు ఈడీ శనివారం నోటీసులిచ్చింది. విచారణ నిమిత్తం ఈ రోజే తమ ముందు హాజరు కావాలని ఆదేశించింది. దీంతో ఆయన ఈడీ కార్యాలయానికి వెళ్లారు. కేసుకు సంబంధించి మంత్రి గెహ్లోత్‌ను ప్రశ్నించిన ఈడీ అధికారులు... ఆయన వాంగ్మూలాన్ని నమోదు చేశారు. గెహ్లోత్... కేజ్రీవాల్ కేబినెట్‌లో హోం, రవాణా, న్యాయశాఖ మంత్రిగా ఉన్నారు. మద్యం విధానంపై ముసాయిదా తయారు చేసే సమయంలో అప్పటి ఆప్ కమ్యూనికేషన్ ఇన్‌ఛార్జ్ విజయ్ నాయర్... గెహ్లోత్ అధికారిక నివాసాన్ని వినియోగించుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ కేసులో మార్చి 21న కేజ్రీవాల్‌ను ఈడీ అధికారులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఏప్రిల్ 1తో ఆయన కస్టడీ ముగియనుంది. ఇటీవల కోర్టు

- మిగతా 2 లో

రేపటి నుంచి 'పది' మూల్యాంకనం

- వారం రోజుల్లో పూర్తికి చర్యలు
- మేలో ఫలితాల విడుదలకు కసరత్తు

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి:
పదో తరగతి పరీక్షా పేపర్ల మూల్యాంకనాన్ని ఏప్రిల్ ఒకటి నుంచి ప్రారంభించేందుకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. ప్రభుత్వ పరీక్షల సంచాలకుడు దేవానంద్‌రెడ్డి అధ్వర్యంలో అందుకు తగిన ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. మూల్యాంకనాన్ని వారం రోజుల్లోనే పూర్తి చేయాలన్న లక్ష్యంతో ఉన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లాల్లో మూల్యాంకన కేంద్రాలను ఏర్పాటు చేశారు. గతంలో అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం, నంద్యాల జిల్లాల్లో మూల్యాంకనం ఉండేది కాదు. ఈ విడత అన్ని జిల్లాల్లోనూ

- మిగతా 2 లో

ఇదీ లోకం!

అధికారంలోకి వస్తే
పదేళ్ల ప్రత్యేక హోదా

- తొమ్మిది గ్యారెంటీలు అమలుచేస్తాం
- సర్వేలు చేసి అభ్యర్థుల ఎంపిక: షర్మిల

2లో

ఇకపై కెనడాలో వర్షానికి పన్ను

వచ్చేనెల నుంచి 'స్ట్రోమ్‌వాటర్ ఛార్జ్' వసూళ్లు

ప్రజల్లో ఆగ్రహం

టొరంటో: పపంచంలోనే తొలిసారిగా 'రెయిన్ ట్యాక్స్' (వర్షానికి పన్ను)ను కెనడా ప్రభుత్వం విధించబోతోంది. ఏప్రిల్ నుంచి వసూళ్లు మొదలు కానున్నాయి. 'స్ట్రోమ్ వాటర్ ఛార్జ్' పేరిట టొరంటోలో దీన్ని అమలు చేయనున్నట్లు ఆ ప్రభుత్వం ప్రకటించింది. కెనడాలో రాతి నేలలే ఉండటంతో వర్షపునీరు నేలలో ఇంకేందుకు చాలా సమయం పడుతుంది. చిన్నపాటి వర్షానికి అక్కడి రోడ్లు పొంగిపొర్లుతాయి. దీనిని 'రన్‌ఆఫ్' అంటారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక మురుగునీటి పారుదల వ్యవస్థ 'స్మార్ట్ వాటర్ ఛార్జ్'ను కెనడా ప్రభుత్వం ప్రారంభించింది.

తద్వారా అదనపు నీటిని బయటకు తీస్తారు. ఇందుకయ్యే ఖర్చులను 'రెయిన్ ట్యాక్స్' ద్వారా భర్తీచేస్తారు. ఈ పన్ను ఒక్కో ప్రాంతానికి ఒక్కోలా ఉంటుంది. భవనాలు ఎక్కువగా ఉంటే రన్‌ఆఫ్ కూడా అధికంగానే ఉంటుంది కాబట్టి అక్కడ పన్ను కూడా ఎక్కువ విధిస్తారు. కెనడా ఇప్పటికే అత్యధిక వ్యక్తిగత పన్ను విధించే దేశాలలో ఒకటిగా ఉంది. ఇప్పుడు వర్షపు పన్ను అంటూ ప్రజలపై మరింత భారం మోపబోతోంది. అద్దెకు ఉండేవారికి ఈ పన్ను వర్తిస్తుందో లేదో తెలియాల్సి ఉంది. కాగా, రెయిన్ ట్యాక్స్‌ను కెనడా ప్రజలు తిరస్కరిస్తున్నారు. టొరంటో ప్రజలు ఇప్పటికే నీటి పన్ను

చెల్లిస్తున్నారు. ఇందులోనే స్టామ్‌వాటర్ నిర్వహణ ఖర్చు ఉంటుందని స్థానికులు అంటున్నారు. మళ్లీ ప్రత్యేక పన్ను విధించడమేమిటని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

పాకిస్థాన్‌లో మళ్లీ పెట్రో మంట

ఇస్లామాబాద్: ఆర్థిక సంక్షోభంలో కూరుకున్న పాకిస్థాన్‌లో మరోసారి పెట్రోల్ ధరలు భగ్గుమన్నాయి. ఊహించని విధంగా ధరలు పెంచుతూ పాక్ ప్రభుత్వం ప్రకటన చేసింది. లీటరుకు రూ.10 (పాకిస్థాన్ రూపాయి) పెంచనున్నట్లు వెల్లడించింది. అంతర్జాతీయంగా ముడిచమురు ధరల పెరుగుదల వల్లే ధరలు పెంచాల్సి వచ్చినట్లు తెలిపింది. తాజా పెంపు తర్వాత లీటరు పెట్రోలు ధర రూ.289.69కి ఎగబాకింది. ఇక డీజిల్ ధరలపై రూ.1.30 తగ్గించడంతో ప్రస్తుతం 285.86 పాకిస్థాన్ రూపాయలుగా ఉన్న లీటరు డీజిల్ ధర రూ.284.26కి చేరనుంది. కిరోసిన్ ధర లీటరుకు రూ.188.66 నుంచి రూ.188.49కు తగ్గింది. అంటే లీటరుకు రూ.0.17 తగ్గుదల నమోదైంది.

ఆప్‌ను వదలని ఈడీ

(మొదటిపేజీ తరువాయి)

విచారణ సందర్భంగా జడ్జి అనుమతితో సీఎం స్వయంగా తన వాదనలు వినిపించారు. కేవలం నాలుగు వాంగ్మూలాలతోనే తనను అరెస్టు చేశారని పేర్కొన్నారు. ఈ కేసులో ఇప్పటికే కొంతమంది ఆప్ నేతల ఇళ్లల్లో దర్యాప్తు అధికారులు సోదాలు జరిపారు.

కేజ్రీవాల్‌పై మరో పిటిషన్

కస్టడీలో ఉన్నప్పటికీ సీఎం కేజ్రీవాల్ అక్కడి నుంచే పాలన సాగిస్తున్నారు. ఈడీ కస్టడీ నుంచే తన సహచర మంత్రులకు పాలనకు సంబంధించిన ఆదేశాలు జారీ చేశారు. అయితే, కేజ్రీవాల్‌ను పదవి నుంచి తొలగించాలని తాజాగా దిల్లీ హైకోర్టులో మరో పిటిషన్ దాఖలైంది. ఇదే విషయంపై గతవారం కూడా పిటిషన్ దాఖలవ్వగా... న్యాయస్థానం దాన్ని కొట్టేసింది.

రేపటి నుంచి 'పది' మూల్యాంకనం

(మొదటిపేజీ తరువాయి)

మూల్యాంకనం చేయనున్నారు. మే మొదటి వారానికి ఎన్నికల కమిషన్ అనుమతితో ఫలితాల విడుదలకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. 25 వేల మంది సిబ్బందిని విధులకు కేటాయించారు. మే 13 నుంచి రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికలు ఉన్నందున లోగానే పరీక్షల ప్రక్రియ నిర్వహణ, మూల్యాంకనంపై దృష్టి పెట్టారు. ఎన్నికల్లోగానే పరీక్షా ఫలితాలను విడుదలకు కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే ఇంటర్ పరీక్షలు విజయవంతంగా పూర్తయ్యాయి, మూల్యాంకనాన్ని ఏప్రిల్ 4వ తేదీతో పూర్తి చేయనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్మీడియట్ ప్రాంతీయ సంయుక్త సంచాలకుల అధ్వర్యంలో మూల్యాంకనం చురుగ్గా కొనసాగుతోంది. అదే తరహాలో పదో తరగతిపైనా దృష్టి పెట్టారు. ఈనెల 18 నుంచి ప్రారంభమైన పది పరీక్షలు విజయవంతంగా ముగిశాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఆరు లక్షల 23 వేల మంది రెగ్యులర్, లక్షా రెండువేల మంది ప్రైవేట్‌గాను పది పరీక్షలు రాశారు. మొత్తం 50 లక్షల జవాబు పత్రాలను ఏప్రిల్ ఒకటి నుంచి మూల్యాంకనం ప్రారంభించి ఎనిమిదో తేదీ నాటికి పూర్తి చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఉంది.

డీఎస్సీ వాయిదా

(మొదటిపేజీ తరువాయి)

పోస్టులను మరిన్ని పెంచి జంబో డీఎస్సీ ఇవ్వాలని కొద్దిరోజులు ఉద్యమించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల షెడ్యూలు వచ్చే కొన్ని వారాల ముందు ఏపీ టెట్ 2024, ఏపీ డీఎస్సీ నోటిఫికేషన్లు ఏకకాలంలో విడుదల చేసింది. టెట్ పరీక్షలను విజయవంతంగా పూర్తిచేసుకుని... డీఎస్సీ పరీక్షలకు ప్రభుత్వం షెడ్యూలు జారీజేసింది. టెట్, డీఎస్సీ పరీక్షల షెడ్యూలు రావడంతో అందరూ పూర్తిస్థాయిలో పరీక్షలకు సిద్ధమయ్యారు. ఇంతలో కొందరు అభ్యర్థులు న్యాయపరమైన సమస్యలపై హైకోర్టును ఆశ్రయించగా టెట్ ఫలితాల వెల్లడికి బ్రేక్ పడింది. దాని ప్రభావంతో ముందస్తుగా ప్రకటించిన షెడ్యూలు ఆధారంగా డీఎస్సీ నిర్వహించలేకపోయారు. ఏపీ టెట్, డీఎస్సీకి మధ్య కనీసం నెల రోజుల వ్యవధి కావాలని హైకోర్టును అభ్యర్థులు ఆశ్రయించడం, వారికి అనుకూలంగా హైకోర్టు ఆదేశాలివ్వడంతో టెట్, డీఎస్సీ పరీక్షలు సవ్యంగా కొనసాగలేదు. టెట్ ఫలితాలను ఈనెల 14వ తేదీన విడుదల చేయాల్సి ఉండగా ఈసీ అనుమతి కోసం అధికారులు వేచి ఉన్నారు. అటు డీఎస్సీకి ఈనెల 30 నుంచి ఏప్రిల్ 30 వరకు షెడ్యూలు జారీజేసినప్పటికీ దాని ప్రక్రియ ముందుకెళ్లలేదు. ఈ క్రమంలో ఏపీ టెట్ ఫలితాల విడుదలకు, డీఎస్సీ పరీక్షల నిర్వహణకు అనుమతి ఇవ్వాలని కోరుతూ ఎన్నికల సంఘానికి ఇటీవల పాఠశాల విద్యా కమిషనర్ సురేశ్‌కుమార్ లేఖ రాశారు. ఈసీ నుంచి అనుమతి వస్తే...టెట్ ఫలితాలు ప్రకటించి, డీఎస్సీ పరీక్షల షెడ్యూలుకు తగిన ప్రణాళిక రూపొందించారు. ఈసీ అందుకు నిరాకరించడంతో ఎన్నికల కోడ్ ముగిశాకే టెట్ ఫలితాలను, డీఎస్సీ పరీక్షలు నిర్వహించాల్సిన అవసరముంది. టెట్, డీఎస్సీ నోటిఫికేషన్లు మూడు నెలల ముందు ప్రకటించి ఉంటే ఎన్నికల షెడ్యూలు విడుదలయ్యే నాటికి నియామక ప్రక్రియ పూర్తయ్యేది. ఇందులో విద్యాశాఖాధికారులు, ప్రభుత్వం మధ్య సమన్వయం లోపించినట్లుగా కన్పిస్తోంది. దాదాపు ఐదేళ్ల నుంచి డీఎస్సీ కోసం నిరుద్యోగులు ఎదురుచూస్తున్నారు. 2018లో చంద్రబాబు ప్రభుత్వం ఇదే తరహాగా అతి తక్కువ పోస్టులతో డీఎస్సీ ఇచ్చింది. ఆ పోస్టులను వైసీపీ ప్రభుత్వం వచ్చాక భర్తీ చేసింది. జగన్ నాడు పాదయాత్ర సమయంలో ఏటా పదివేల పోస్టులతో జంబో డీఎస్సీ ఇస్తానని నిరుద్యోగ యువతకు హామీ ఇచ్చారు. ఆ హామీలో భాగంగా టెట్, డీఎస్సీ పరీక్షలకు ప్రభుత్వం సన్నద్ధమవ్వగా కరోనా కారణంగా వాటి ప్రక్రియ నిలిచిపోయింది. అనంతరం ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందు టెట్, డీఎస్సీ నోటిఫికేషన్లు ఏకకాలంలో ప్రభుత్వం విడుదల చేయగా, వాటి ప్రక్రియకు ఎన్నికల కోడ్ అడ్డంకిగా మారింది. ఎంతో కష్టపడి, డబ్బులు వెచ్చించి ప్రైవేట్ ఇనిస్టిట్యూట్‌లో శిక్షణ పొందుతున్న తాము తీవ్రంగా నష్టపోయామని ఉపాధ్యాయ నిరుద్యోగ అభ్యర్థులు వాపోతున్నారు.

తుస్సుమన్న జగన్ యాత్ర

దేవినేని ఉమా విమర్శ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, వైసీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్ రెడ్డి చేపట్టిన బస్సు యాత్ర తుస్సుమన్నదని టీడీపీ మాజీ మంత్రి దేవినేని ఉమా మహేశ్వరరావు విమర్శించారు. పార్టీ కేంద్ర కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్‌పై విమర్శలు గుప్పించారు. ఓటమి భయంతోనే అబద్ధాలు చెప్పి ప్రజలను మోసగిస్తున్నారన్నారు. ఎన్నికలకు ముందు బాబాయి హత్య కేసులో, కోడికత్తి డ్రామాతో సానుభూతి పొందాడు. ఒక్క ఛాన్స్ అంటూ పాదయాత్రలో ముద్దులు పెట్టి ఇప్పుడు గుద్దులు గుద్దుతున్నాడు. ఐదేళ్ల పాలనలో సాధించిన ప్రగతి, అభివృద్ధి ఏమి లేదు. ఇసుక దొరక్క ప్రజలు రోడ్డున పడుతున్నారు. మద్యాన్ని నిషేధించిన తర్వాతే ఓట్లు అడుగుతానని చెప్పి ఇప్పుడు నిసిగ్గుగా ప్రచారానికి వెళుతున్నాడని దేవినేని ఉమా విమర్శించారు. వివేకా హత్యపై నీ చెల్లెళ్లు సునీత రెడ్డి, షర్మిల అడిగే ప్రశ్నలకు జవాబు చెప్పగలవా? బాబాయిని చంపిన హంతకుల్ని ఎందుకు పక్కన పెట్టకున్నావ్? నీ ఇద్దరు చెల్లెళ్లకు సమాధానం చెప్పని నువ్వు ప్రజల్ని ఓట్లు ఎలా అడుగుతావని ఉమా ప్రశ్నించారు. పేదలూ-పెత్తందార్లు అంటూ ఊదరగొడుతున్న జగన్... ఇడుపులపాయ, కడప, బెంగుళూరు, హైదరాబాద్, రిషికొండ, చెన్నైలో ఉన్న ప్యాలెస్‌లు ఎవరివో చెప్పాలని డిమాండ్ చేశారు. పోలవరం పేరిట ఓటు అడిగే అర్హత జగన్‌కు లేదన్నారు. 'మూడు రాజధానులంటూ మూడు ముక్కలాట ఆడి రాష్ట్రానికి రాజధాని లేకుండా చేశావు. ఒప్పంద ఉద్యోగస్తుల క్రమబద్ధీకరణ పేరిట మోసం చేశావు. ప్రభుత్వ ఉద్యోగులకు డీఏ అందలేదు. సీపీఎస్ రద్దు కాలేదు. అన్నా క్యాంటీన్లు మూయించి మద్యం దుకాణాలు తెరిపించావు. ఇమామ్, మౌజన్‌లకు రూ.15 వేలు ఇస్తానని, పాస్టర్లకు ఇళ్లు కట్టిస్తానని చెప్పి మోసం చేశావు. అసైన్డ్ భూములను పరిరక్షిస్తానని చెప్పి భూములను దోచుకున్నారు. ఆర్టీసీ చార్జీలు తగ్గిస్తానని చెప్పి మోసం చేశావు. ఇన్ని మోసాలకు పాల్పడిన నీకు ప్రజలు గుణపాఠం చెప్పడం ఖాయం' అని జగన్‌నుద్దేశించి ఉమా హెచ్చరించారు.

విమానం తలుపు పక్కన కూర్చోనుగా!

బోయింగ్ విమానాల్లో

నాణ్యతా లోపాలపై బైడెన్

వాషింగ్టన్: ఎయిర్ ఫోర్స్ వన్ బోయింగ్ విమానం తలుపు పక్కన కూర్చోను అని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ వెల్లడించారు. ఈమధ్య కాలంలో బోయింగ్ విమానాల్లో నాణ్యతా లోపాలు వెలుగులోకి రావడాన్ని ఉద్దేశించి అధ్యక్షుడు ఈ విధంగా చమత్కరించారు.

బైడెన్ ఓ టాక్‌లో పాల్గొన్నారు. న్యూయార్క్ వెళ్లేముందు ఎయిర్‌ఫోర్స్ వన్ (అధ్యక్షుడు ప్రయాణించే విమానం) బోల్టులను రవాణాశాఖ మంత్రి సరిగా బిగించారా అంటూ వ్యాఖ్యత ప్రశ్నిస్తే... నేను అసలు తలుపు దగ్గర కూర్చోనుగా' అని బైడెన్ సరదాగా అన్నారు. అయితే ఇలాంటి విషయాల్లో తమాషా సరికాదని కూడా ఆయనన్నారు. ఇటీవల అలస్కా



ఎయిర్‌లైన్స్‌కు చెందిన బోయింగ్ 737 మ్యాక్స్ 9 విమానం అమెరికాలోని పోర్ట్‌ల్యాండ్ నుంచి కాలిఫోర్నియాకు వెళ్తుండగా విమానం తలుపు ఊడి కిందపడింది. ఆ సమయంలో విమానం 16 వేల అడుగుల ఎత్తులో ఎగురుతోంది. అందులో 171 మంది ప్రయాణికులు ఉన్నారు. అంతకుముందు కూడా బోయింగ్ విమానాల్లో భద్రతాపరమైన లోపాలు వెలుగు చూసిన విషయం తెలిసిందే.

ఇజ్రాయిల్‌కు అమెరికా బాంబులు, యుద్ధ విమానాలు

కొత్త ఆయుధ ప్యాకేజీలో భాగంగా సరఫరా

వార్షిక సాయంగా 3.8 బిలియన్ డాలర్లు



వాషింగ్టన్: గాజాపై ఇజ్రాయిల్ దాడులకు అమెరికా తోడ్పాటు అందిస్తోంది. తాజాగా రెండు వేల బాంబులు ఆ దేశానికి సరఫరా చేస్తోంది. కొత్త ఆయుధ ప్యాకేజీలో భాగంగా బాంబులు, యుద్ధ విమానాలను పంపేందుకు సిద్ధమైంది. వార్షిక సైనిక సహాయంగా 3.8 బిలియన్ డాలర్లను కూడా ఇజ్రాయిల్‌కు అందజేసింది.

ఈ మేరకు అంతర్జాతీయ నివేదికలు పేర్కొన్నాయి. వాషింగ్టన్‌లోని ఇజ్రాయిల్ రాయబార కార్యాలయంగానీ శ్వేతసౌధం వర్గాలుగానీ ఇప్పటివరకు ఈ విషయమై స్పందించలేదు. గాజాలో ఇజ్రాయిల్ అమానవీయ దాడులపై అంతర్జాతీయంగా వ్యతిరేకత వస్తున్నాగానీ అమెరికా ఆయుధాలు సరఫరా చేయడం విమర్శలకు దారి తీసింది. ఇప్పటికే 32వేల మందికిపైగా పలస్తీనియన్లు ఇజ్రాయిల్ దాడుల్లో చనిపోయారని గాజా ఆరోగ్యశాఖ పేర్కొంది. తక్షణ కాల్పుల విరమణ కోసం ఐరాస తీర్మానంపై ఓటింగ్‌కు అమెరికా దూరంగా ఉంది.

ఇజ్రాయికు అమెరికా సైనికపరంగా మద్దతివ్వడంతో అనేక మంది అరబ్ అమెరికన్లు బాధపడుతున్నారని బైడెన్ కూడా అంగీకరించారు.

అధికారంలోకి వస్తే పదేళ్ల ప్రత్యేక హోదా

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకిరాగానే తొమ్మిది గ్యారెంటీలను అమలు చేస్తామని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల చెప్పారు. విజయవాడ ఎస్ఎస్ కన్వెన్షన్ హాలులో శనివారం గడప గడపకు కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. తొమ్మిది గ్యారెంటీలతో కూడిన కరపత్రం, డోర్ స్టిక్కర్లను షర్మిల ఆవిష్కరించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రానికి 10 ఏళ్ల ప్రత్యేక హోదాను, ప్రతి పేద మహిళకు ప్రతి నెలా రూ.8,500, రైతులకు రూ.రెండు లక్షల వరకు రుణమాఫీ, పెట్టుబడిపై 50 శాతం లాభంతో కొత్త మద్దతు ధర, ఉపాధి హామీ కూలీలకు కనీస వేతనం రూ.400, కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య, 2.25 లక్షల ఉద్యోగాల భర్తీ, ఇల్లు లేని ప్రతి పేద కుటుంబానికి మహిళ పేరు మీద రూ. ఐదు లక్షలతో పక్కా ఇళ్లు, ఇంట్లో ఉన్న అర్హులందరికీ రూ.నాలుగు వేల పింఛన్, దివ్యాంగులకు రూ.ఆరువేలు అందజేసేలా



కాంగ్రెస్ నిర్ణయించింది. షర్మిల మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసేందుకు 1500 దరఖాస్తులు వచ్చాయని, సర్వేలు చేసి, రాష్ట్ర నాయకుల అభిప్రాయాలను తీసుకుని అభ్యర్థులను ఎంపిక చేస్తామన్నారు. టికెట్ రాని వాళ్లు కాంగ్రెస్ గెలుపు కోసం శ్రమించక పోతే చరిత్ర క్షమించబోదని చెప్పారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలో రావాల్సిన అవసరముందన్నారు. కాంగ్రెస్ పార్టీ అంటే ప్రజల్లో ఒక నమ్మకం... ఇదే మన బలమని చెప్పారు. రాష్ట్రంలో టీడీపీ,వైసీపీ రెండూ బీజేపీ తొత్తులేనని, బీజేపీ మేలు చేయక పోయినా బాబు, జగన్ బానిసలుగా మారారని మండిపడ్డారు. ఇప్పటివరకు రాష్ట్రానికి పదేళ్ల ప్రత్యేక హోదా ప్రస్తావనే లేదని, విభజన హామీలు ఒక్కటి అమలు కాలేదని చెప్పారు. చంద్రబాబు బీజేపీతో 2014లో పొత్తు పెట్టుకొని విడాకులు తీసుకున్నారని, మళ్లీ ఇప్పుడు పొత్తు పెట్టుకున్నారని ఎద్దేవా చేశారు. జగన్‌ను ఏకంగా నిర్మలా సీతారామన్ మోదీకి దత్తపుత్రుడు అన్నారని, ఒకరిది బహిరంగ పొత్తు... మరొకరిది రహస్య పొత్తు అని విమర్శించారు. బీజేపీ అంటే బాబు, జగన్, పవన్ అని చెప్పాలన్నారు. కాంగ్రెస్ పార్టీ మాత్రమే హోదాపై కట్టుబడి ఉందని, కాంగ్రెస్ గ్యారెంటీలను మనం గడప గడపకూ చేర్చాలని కోరారు. సీడబ్ల్యూసీ సభ్యులు రఘువీరారెడ్డి, గిడుగు రుద్రరాజు, పార్టీ నేతలు జేడీ శీలం, పల్లంరాజు, మస్తాన్, సుంకర పద్మశ్రీ, విజయవాడ నగర కాంగ్రెస్ అధ్యక్షుడు నరహరిశెట్టి నరసింహారావు పాల్గొన్నారు.

కర్నాటకలో బీజేపీకి ఎదురు దెబ్బ

బెంగళూరు: కర్నాటకలో బీజేపీకి ఎదురు దెబ్బ తగిలింది. కొద్ది రోజుల కిందట రాజీనామా చేసిన పార్టీ ఎమ్మెల్సీ తేజస్విని గౌడ శనివారం కాంగ్రెస్‌లో చేరారు. రాజ్యాంగ, ప్రజాస్వామిక విలువలను కాషాయ పార్టీ నమ్మదని, అందుకోసమే బయటకు వచ్చేశానని గౌడ తెలిపారు. గౌడ 2004-09 వరకు కాంగ్రెస్ ఎంపీగా ఉన్నారు. 2014లో బీజేపీలో చేరారు. ఇప్పుడు మళ్లీ కాంగ్రెస్‌లోకి తిరిగి రావడాన్ని 'ఘర్ వాపసీ'గా వెల్లడించారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్, మీడియా శాఖాధిపతి పవన్ ఖేరా సమక్షంలో పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆమె కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. కర్నాటక రాజకీయాల్లో క్రియాశీలంగా ఉండే తేజస్విని గౌడ తిరిగి కాంగ్రెస్‌లోకి రావడం సంతోషంగా ఉందని, ఆమెను సాదరంగా పార్టీలోకి ఆహ్వానిస్తున్నామని జైరాం రమేశ్ అన్నారు.

వలంటీర్ల సేవలకు బ్రేక్ !

(మొదటిపేజీ తరువాయి)

జారీ చేసింది. పార్టీ కార్యకర్తలను వలంటీర్లుగా నియమించుకున్న వైసీపీ ప్రభుత్వం... వారికి ప్రచారం చేయకుండా ఎలా ఉంటారని ప్రతిపక్ష నేతలు ఆరోపించారు. దీనిపై స్పందించిన కేంద్ర ఎన్నికల సంఘం ఎట్టకేలకు కీలక ఆదేశాలు జారీ చేసింది. హైకోర్టులో సిటిజన్ ఫర్ డెమోక్రసీ దాఖలు చేసిన పిటిషన్... దానిపై హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను ప్రస్తావిస్తూ వలంటీర్ల విషయంలో తగు చర్యలు తీసుకోవాలని ఏపీ సీఈవోను ఈసీ ఆదేశించింది. ఆ మేరకు వీరిని ఎన్నికల విధులకు దూరంగా ఉంచాలని నిర్ణయించినట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేశ్ కుమార్ మీనా శనివారం మీడియాకు తెలిపారు. రాష్ట్రంలో ఎన్నికల నియమావళి అమల్లో ఉన్నంత వరకూ ఏపీటెట్ ఫలితాలు వెలువరించ వద్దని, ఏపీటీఆర్టీ పరీక్షలు వాయిదా వేయాలని కూడా ఎన్నికల సంఘం ఆదేశాలు జారీచేసింది. ఈ నిర్ణయాలకు సంబంధించిన ఆదేశాలు ఎన్నికల సంఘం నుండి తమ కార్యాలయానికి అందాయని మీనా తెలిపారు. భారత ఎన్నికల సంఘం జారీచేసిన ఆదేశాల మేరకు వలంటీర్ల ద్వారా లబ్దిదారులకు ఎటువంటి పథకాలు, పింఛను నగదు పంపిణీ చేయకూడదని, ప్రభుత్వం వలంటీర్లకు ఇచ్చిన సెల్‌ఫోన్లు, ట్యాబ్లు, ఇతర డివైజ్‌లను వెంటనే సంబంధిత జిల్లా ఎన్నికల అధికారుల వద్ద డిపాజిట్ చేయాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వం కొనసాగిస్తున్న పథకాలను ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ప్రత్యేకించి ప్రభుత్వ ఉద్యోగుల ద్వారా అమలు పర్చాలని సూచించినట్లు మీనా వెల్లడించారు.

ఇక ఏపీటెట్ ఫలితాలు వెలువరించే అంశం, ఏపీటీఆర్టీ పరీక్షలు నిర్వహించే అంశానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నుండి అందిన ప్రతిపాదనలను భారత ఎన్నికల సంఘం పరిశీలించిందని, ఈ అంశానికి సంబంధించి రాష్ట్రంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉన్నంత వరకూ ఆ రెండు అంశాలను వాయిదా వేయాలని తమకు స్పష్టమైన ఆదేశాలు జారీచేసినట్లు ముకేశ్ కుమార్ మీనా తెలిపారు.

న్యాయ వ్యవస్థపై సర్కార్ ఒత్తిడి మర్మమేమిటో.. : ప్రియాంక

న్యూదిల్లీ: న్యాయ వ్యవస్థ స్వతంత్రంగా, పటిష్ఠంగా ఉండటం మోదీ ప్రభుత్వానికి నచ్చడం లేదా అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా శనివారం ప్రశ్నించారు. ఎన్నికల బాండ్లపై తీర్పు వెలువడిన తర్వాత నుంచి న్యాయ వ్యవస్థ తీవ్ర ఒత్తిడికి లోనవుతోందని ఆమె అన్నారు. 'ఎన్నికల బాండ్లు రద్దు చేస్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన తర్వాత కుంభకోణాలు ఒక్కొక్కటిగా బయట పడుతుండటాన్ని చూసి న్యాయ వ్యవస్థలకు కొందరు లేఖలు రాయడం, వాటిపై ప్రధాని స్వయంగా స్పందించడాన్ని బట్టి ఎక్కడో ఏదో జరుగుతోందన్న అనుమానం కలుగుతోంది' అని 'ఎక్స్' మాధ్యమంగా ప్రియాంక హిందీలో వ్యాఖ్యానించారు. ఏదో విషయం ప్రధానిని కలవరపెడుతోందన్నారు. సుప్రీంకోర్టు జడ్జిలు విలేకరుల సమావేశాలు నిర్వహించడం, రాజ్యసభకు ఓ న్యాయమూర్తిని పంపడటం, మాజీ జడ్జికి ఎన్నికల టికెట్ ఇవ్వడం, జడ్జిల నియామకాలను నియంత్రించడం, అనుకూలంగా తీర్పులు రానప్పుడు న్యాయ వ్యవస్థపై వ్యాఖ్యలు చేయడం వంటివి చూస్తుంటే న్యాయ వ్యవస్థ పటిష్ఠతంగా, స్వతంత్రంగా ఉండటం మోదీ ప్రభుత్వానికి నచ్చడం లేదని ప్రియాంక వ్యాఖ్యానించారు. న్యాయ వ్యవస్థను 'స్వప్రయోజనాలు ఆశించే వర్గం' ఒత్తిడికి గురి చేస్తోందని, కోర్టు ప్రతిష్ఠను దిగజారుస్తోందని సీజేఐకి 600 మంది న్యాయవాదులు లేఖ రాయడంపై స్పందించిన ప్రధాని మోదీ కాంగ్రెస్ పార్టీపై మండిపడ్డారు.

రాయలసీమను కోనసీమ చేస్తా

(మొదటిపేజీ తరువాయి)

పట్టించుకోలేదని విమర్శించారు. ఎన్డీయే కూటమితో జగన్‌కు ఓటమి భయం పెట్టుకున్నదన్నారు. ఒకప్పుడు వ్యాపార పరంగా ప్రొద్దుటూరు పేరుగాంచితే వైకాపా పాలనలో అసాంఘీక కార్యకలాపాలకు అడ్డాగా మారిందన్నారు. ప్రొద్దుటూరులో పార్టీ కోసం కష్టపడ్డ వారికి ప్రాధాన్యత కల్పిస్తానని అన్నారు. వైసీపీ అరాచక పాలనకు విసిగి వేసారి వలసల బాట పట్టారన్నారు. నాడు టీడీపీ ప్రభుత్వం రాయలసీమను సస్యశ్యామలంగా మార్చేందుకు రూ.12వేల కోట్లు చేస్తే జగన్ ప్రభుత్వం కేవలం రూ.2వేల కోట్లు వెచ్చించించడాన్ని బట్టి ఈ ప్రాంత రైతులు, ప్రజల సంక్షేమం ముఖ్యమంత్రికి పట్టడం లేదని అర్థమవుతోందన్నారు. గుండ్లకమ్మ, ఓర్వకల్లు, హంద్రీనీవా, గాలేరు, నగరి, గండికోట ప్రాజెక్టులను పూర్తి చేసిన ఘనత టీడీపీదేనన్నారు. గండికోట ప్రాజెక్టు ద్వారా పులివెందుల రైతులకు సాగు-తాగునీరు అందించామన్నారు. కృష్ణా జలాలను రాయలసీమకు తీసుకురావాలన్న ఎన్‌టీ రామారావు ఆశయమని, పోలవరం ప్రాజెక్టును పూర్తిచేసి రాయలసీమకు నీళ్లు ఇవ్వాలన్నదే తన అభిమతమని చంద్రబాబు తెలిపారు. రాయలసీమ గురించి మాట్లాడే అర్హత జగన్‌కు లేదన్నారు. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా చేస్తానని హామీనిచ్చారు. క్విట్ జగన్‌మోహన్ రెడ్డి అంటూ పిలుపునిచ్చారు. ఆంధ్రపదేష్‌ను గంజాయి, మాదక ద్రవ్యాల కేంద్రంగా తయారు చేశారని, మద్యం నిషేధాన్ని గాలికొదిలేసి జగన్ బ్రాండ్లు అమ్ముతూ పేదల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని చంద్రబాబు విమర్శించారు. 25వేల కేజీల డ్రగ్స్ విశాఖలో పట్టుబడితే సరఫరా చేసేవారిని, వారికి మద్దతిచ్చేవారిని జైలుకు పంపాల్సిన జగన్ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం తెలుగుజాతికి సిగ్గుచేటన్నారు. బాబాయిని చంపిన వ్యక్తికే వైసీపీ ఎంపీ సీటు ఇచ్చారని, ముద్దాయి పక్కనుంటే ఓట్లు ఎలా వస్తాయని చంద్రబాబు ప్రశ్నించారు. వివేకా హత్య కేసులో 8వ ముద్దాయిగా ఉన్న ఎంపీకి సీట్లు అడిగే అర్హత ఉందా అని నిలదీశారు. తనది విజన్... జగన్‌ది పాయిజన్ అని ఎద్దేవా చేశారు. ప్రొద్దుటూరు సభలో జగన్ ప్రసంగిస్తుండగానే ప్రజలు పారిపోయారన్నారు. బిర్యాని ప్యాకెట్లు, మందు బాటిల్లు ఇచ్చి 10 జిల్లాలనుంచి జనాన్ని తెచ్చుకున్నారని జగన్‌ను చంద్రబాబు ఎద్దేవా చేశారు. ఎండను సైతం లెక్కచేయకుండా టీడీపీ అభిమానులు, కార్యకర్తలు వేచివుండటం ద్వారా వారికి తనపై ఎంత అభిమానమో తెలుస్తుందన్నారు. రానున్నది రామరాజ్యం అని, జాబు కావాలంటే బాబు రావాలని చంద్రబాబు నినాదమిచ్చారు. జగన్ మోహన్ రెడ్డి ఏ పరిశ్రమ తేలేకపోయారని, ఉన్న పరిశ్రమలను సైతం ఇతర రాష్ట్రాలకు తరలేలా చేశారని ఆరోపించారు. రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా పేదలకు న్యాయం చేయడమే లక్ష్యంగా పవన్ కల్యాణ్ రాజకీయాల్లోకి వచ్చారని చంద్రబాబు చెప్పారు. జగన్ ఓటమే లక్ష్యంగా పొత్తుకు సిద్ధమయ్యారని తెలిపారు. టీడీపీలోకి కొనిరెడ్డి శివచంద్రారెడ్డి చేరడం ఆనందకరమని అన్నారు. కార్యక్రమంలో నాయకులు వరదరాజుల రెడ్డి, నంద్యాల కొండారెడ్డి, సురేశ్ నాయుడు, పుట్టా సుధాకర్ యాదవ్, భూపేష్ రెడ్డి పాల్గొన్నారు.

మంచి చేశా...ఆదరించండి

(మొదటిపేజీ తరువాయి)

ముఖ్యమంత్రి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలు తమ సమస్యలను జగన్‌కు విన్నవించారు. రాతన గ్రామంలో సర్పంచ్ రాచప్ప మాట్లాడుతూ హంద్రీనీవా ద్వారా నీళ్లు మళ్లించేందుకు వేసిన పైప్ లైన్ నిర్మాణ పనులు తమ చెరువు వద్ద పూర్తయ్యాయని తెలిపారు. భవిష్యత్తులో రైతాంగానికి ఈ పథకం ఎంతో ఉపయోగపడుతుందని ఆయన సీఎం కు తెలియజేశారు. పొలం పనులు చేసుకుంటున్న మహిళలను చూసిన జగన్ బస్సు దిగి ఆప్యాయంగా పలకరించారు. తుగ్గలిలోని తమ్మారెడ్డి కుటుంబంలో కరోనా సమయంలో మరణించిన ప్రతాప్ రెడ్డి, ప్రహ్లాద రెడ్డి చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులు అర్పించారు. తిమ్మారెడ్డి కుటుంబానికి అండగా ఉంటానని ముఖ్యమంత్రి తెలిపారు. అనంతరం తుగ్గలిలో ముఖాముఖి కార్యక్రమంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ వివక్ష లేకుండా అందరికీ నేరుగా నగదు బదిలీ చేశామని, గ్రామాల అభివృద్ధికి కోట్ల రూపాయల నిధులు మంజూరు చేశామని చెప్పారు. లంచాలు లేని పాలన అందించామన్నారు. రాతన,తుగ్గలిలో తొంభై ఐదు శాతం ఇళ్లకు లబ్ధి చేకూర్చామన్నారు.

తుగ్గలి గ్రామపంచాయతీలో వివిధ పథకాల ద్వారా 29.65 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేశామన్నారు. ప్రభుత్వం అమలు చేసిన పథకాలను వివరించారు. మీ కుటుంబంలో మీకు న్యాయం జరిగిందనిపిస్తే తమ పార్టీకి ఓటేయాలని అభ్యర్థించారు. కాగా, ఎన్నికల మేనిఫెస్టోలో రైతులకు రుణమాఫీ చేర్చాలని ప్రజలు సీఎం దృష్టికి తీసుకువచ్చారు. రోడ్ షోలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, వైఎస్ఆర్‌సీపీ ప్రాంతీయ సమన్వయకర్త రామసుబ్బారెడ్డి, మహిళా కమిషన్ మాజీ చైర్మన్ వాసిరెడ్డి పద్మ, వైసీపీ ఎంపీ అభ్యర్థి బీవై రామయ్య, ఎమ్మెల్యే శ్రీదేవి, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి, స్థానిక నాయకులు తుగ్గలి శ్రీనివాస్ రెడ్డి, రమణారెడ్డి, మోహన్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, రాతన మోహన్ రెడ్డి, జగన్నాథ్ రెడ్డి, జిట్టా నాగేశ్, హనుమంతు, గోపాల్ రెడ్డి, బసిరెడ్డి, నాగభూషన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పుదుచ్చేరిలో కాంగ్రెస్‌కు డీఎంకే ప్రచారం

నేడు ఉదయనిధి రోడ్‌షో

7న స్టాలిన్ సభ



చెన్నై: ఇండియా కూటమి తరపున పుదుచ్చేరి లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి డీఎంకే సిద్ధమైంది. కాంగ్రెస్ అభ్యర్థి వి.వైథిలింగం పుదుచ్చేరి నుంచి పోటీ చేస్తున్నారు. ఆయన తరపున తమిళనాడు ముఖ్యమంత్రి, డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్, డీఎంకే యువ నేత, క్రీడా శాఖ మంత్రి ఉదయనిధి స్టాలిన్ ప్రచారం చేయనున్నారు. ఉయయనిధి ఆదివారం భారీ రోడ్డు షో నిర్వహించనున్నారు. అలాగే ఏప్రిల్ 7న స్టాలిన్ ప్రచారం చేయనున్నారు. ఈ మేరకు డీఎంకే కన్వీనర్ ఆర్.శివ శనివారం విలేకరుల సమావేశంలో ప్రకటించారు. ఏప్రిల్ 7వ తేదీ సాయంత్రం ఉప్పలం మైదానంలో బహిరంగ సభ జరుగుతుందని, ఇందులో స్టాలిన్ ప్రసంగిస్తారని ఆయన చెప్పారు. అలాగే, కాంగ్రెస్ అభ్యర్థి తరపున విల్లియనూర్ నుంచి ప్రచారాన్ని ఉదయనిధి స్టాలిన్ ప్రారంభిస్తారన్నారు. ఆయన రోడ్‌షో... మరప్పలం, అన్నా తిడల్‌లో ముగుస్తుందని శివ వెల్లడించారు.

మహనీయుల జయంతులు ఘనంగా జరుపుదాం: డీహెచ్‌పీఎస్

విశాలాంధ్ర-విజయవాడ: మహనీయులు, నవయుగ వైతాళికులు, సామాజిక విప్లవకారుల జయంతి కార్యక్రమాలను రాష్ట్రంలో ఘనంగా జరపాలని దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) పిలుపునిచ్చింది. ఈ మేరకు సమితి రాష్ట్ర అధ్యక్షుడు జేవీ ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు, కార్యనిర్వాహక కార్యదర్శి బుట్టి రాయప్ప శనివారం సంయుక్త ప్రకటన విడుదల చేశారు. ఏప్రిల్ 5న మాజీ ఉపప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్, 11న ఉద్యమనేత జ్యోతిరావు పూలే, 14న రాజ్యాంగ నిర్మాత, డా. బీఆర్ అంబేద్కర్ జయంతులు ఘనంగా జరపాలని సూచించారు. ఎన్నికల వేళ ఈ కార్యక్రమాలను సైద్ధాంతిక నిబద్ధతతో జరుపుకోవాలన్నారు. దేశ ప్రజలు ప్రజాస్వామ్య, లౌకిక విధానాలు పాటిస్తూ సోదర భావంతో కలిసిమెలిసి జీవించాలని, మహనీయుల ఆశయాలతో స్ఫూర్తి పొందటానికి ఈ కార్యక్రమాలను జరుపుకోవడం మన కర్తవ్యంగా భావించాలని నాయకులు పేర్కొన్నారు.

'అలీ' అసంతృప్తి!

సీట్ల కేటాయింపులో మొండిచేయి

రాజ్యసభ ఆశించి భంగపాటు: పార్టీ కార్యక్రమాలకు దూరం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సినీ నటుడు అలీకి టికెట్ కేటాయింపులో వైసీపీ మొండిచేయి చూపింది. పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో ఆయనకు ఎక్కడా బెర్త్ దొరకలేదు. దీంతో ఆయన పార్టీ వైఖరిపై పూర్తి అసంతృప్తితో ఉన్నట్లు ప్రచారం. వైసీపీ ఇన్‌ఛార్జిల మార్పులు, చేర్పుల్లో భాగంగా అలీని నంద్యాల, నెల్లూరు, గుంటూరు లోక్‌సభ స్థానాల్లో బరిలోకి దించుతారన్న ప్రచారం జరిగింది. లేకుంటే కర్నూలు, విజయవాడ పశ్చిమ అసెంబ్లీ సీటు ఇస్తారన్న ఊహాగానాలు వచ్చాయి. అందుకు భిన్నంగా అలీకి ఎక్కడా సీటు లభించలేదు. ఐదేళ్ల పాటు ఖాళీ అయిన మూడు రాజ్యసభ స్థానాలను వైసీపీకి చెందిన కీలక నేతలకే కేటాయించారు. అందులో ఇద్దరు రెడ్డి, ఒకరు ఎస్సీ (మాల) సామాజికవర్గానికి చెందిన వారున్నారు. రాజ్యసభ సీటైనా వస్తుందని ఆయన ఆశించి భంగపాటుకు గురయ్యారు. అలీ కూడా తనకు సీఎంవో నుంచి పిలుపు వస్తుందని, ఎక్కడ నుంచి పోటీ చేయాలన్న దానిపై పార్టీ అధినేత జగన్ సూచిస్తారని వెల్లడించారు. అంతకుముందు నిర్వహించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సామాజిక సాధికార బస్సు యాత్రల్లో చాలా ప్రాంతాల్లో అలీ పాల్గొని ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం చేశారు. రాబోయే ఎన్నికల్లో వైసీపీని గెలిపించాలని కోరారు. గత ఎన్నికల్లోనూ అలీ వైసీపీ తరపున రాష్ట్ర వ్యాప్తంగా విస్తృతంగా తిరిగారు. మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ ప్రచారం చేశారు. ఇటీవల అలీ పేరు ఎక్కడా వినిపించడం లేదు. వైసీపీ ప్రచార కార్యక్రమాలకు హాజరు కావడం లేదు. 'మేమంతా సిద్ధం' పేరుతో వైసీపీ అధినేత జగన్ ప్రారంభించిన బస్సు యాత్రల్లోనూ కనిపించడం లేదు. తాజాగా నంద్యాలలో జరిగిన సభా వేదికగా కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్ పాషాను రెండేళ్లలో ఖాళీ కాబోయే రాజ్యసభకు పంపిస్తానని జగన్ ప్రకటించారు. కర్నూలు సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న హఫీజ్‌ను పక్కనపెట్టి, ఆయన స్థానంలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఇంతియాజ్‌ను ఎమ్మెల్యే అభ్యర్థిగా ఖరారు చేశారు. దీంతో హఫీజ్‌కు రాజ్యసభ హామీ దక్కింది. ఇంతకాలం కష్టపడి పనిచేసిన అలీకి ఆ పార్టీ అధినేత ఎలాంటి హామీ ఇవ్వకపోవడం విమర్శలకు తావిస్తోంది. దీంతో అలీ పూర్తిగా అసంతృప్తికిలోనై పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉంటున్నట్లు సమాచారం. అలీకి ప్రస్తుతం ప్రభుత్వ సలహాదారు పదవి ఒక్కటే మిగిలింది. దీంతో అలీ రాజకీయ భవిష్యత్ ఏమిటి? ఆయనకు వైసీపీ ఎలాంటి హామీ ఇచ్చిందనేది ప్రశ్నార్థకంగా మారింది.

సీఏఏ అమలు ప్రమాదకరం

శ్రీనివాసరావు, ఈశ్వరయ్య

ఒంగోలులో వామపక్ష, లౌకిక పార్టీల నిరసన ప్రదర్శన

విశాలాంధ్ర-ఒంగోలు టౌన్: పౌరసత్వ సవరణ చట్టం అమలు దేశానికి అత్యంత ప్రమాదకరమని, మోదీ మత దురహంకార విధానాన్ని దేశ ప్రజలందరూ ముక్తకంఠంతో ఖండించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. రాజ్యాంగ స్ఫూర్తికి తిలోదకాలిచ్చి బీజేపీ ప్రభుత్వం సీఏఏ వంటి నిరంకుశ చట్టాన్ని తీసుకురావడాన్ని వ్యతిరేకిస్తూ ఒంగోలులో వామపక్ష, లౌకికపార్టీల ఆధ్వర్యంలో శనివారం నిరసన ప్రదర్శన జరిగింది. ఒంగోలు పాత మార్కెట్ సెంటర్‌లోని మౌలానా అబుల్ కలాం ఆజాద్ విగ్రహానికి శ్రీనివాసరావు పూలమాల వేసి నివాళి అర్పించారు. అక్కడి నుంచి ప్రారంభమైన ప్రదర్శన ఒంగోలు కలెక్టరేట్ వరకు సాగింది. అనంతరం జరిగిన కార్యక్రమానికి సీపీఎం నగర కార్యదర్శి జి.రమేశ్ అధ్యక్షత వహించారు.

శ్రీనివాసరావు మాట్లాడుతూ అత్యంత ప్రమాదకరమైన పౌరసత్వ సవరణ చట్టం అమలును నిలిపివేయాలని, ఎన్నికల షెడ్యూల్ ఇచ్చిన తరువాత కేంద్ర ప్రభుత్వం నిబంధనల పేరుతో మైనార్టీలు, భారతదేశ పౌరులను వేధించటానికి కుట్రపూరిత వైఖరితో వ్యవహరిస్తున్న దన్నారు. 2014కు ముందు పక్క దేశాల నుంచి వచ్చిన ముస్లింలు, హిందువులు, బుద్ధులు, క్రైస్తవులు ఎవరికైనా సరే ఒకటే నిబంధన ఉండాలి తప్ప ముస్లింలకు పౌరసత్వం ఇవ్వబోమని చెప్పటం సరికాదన్నారు. మనదేశ ముస్లింలు భారతీయులమని నిరూపించుకోవాల్సి రావడం బాధాకరమన్నారు. భారత్‌ను పాకిస్తాన్‌లా మత రాజ్యంగా మార్చుస్తామంటే ఊరుకోబోయేది లేదన్నారు. మనది లౌకిక రాజ్యమని, అందరికీ మత స్వేచ్ఛ ఉందన్నారు. అన్ని మతాలను సమానంగా రాజ్యాంగం గౌరవిస్తుందన్నారు. మోదీ సర్కారు దురహంకార విధానాన్ని అందరూ ఖండించాలన్నారు. రాష్ట్రంలోని అధికార వైసీపీ, ప్రతిపక్ష టీడీపీ...సీఏఏకు అనుకూలంగా ఓట్లు వేసి ఇప్పుడు ముస్లింల హక్కులు కాపాడతామని హామీలు గుప్పిస్తున్నాయని మండిపడ్డారు. రానున్న ఎన్నికల్లో మతతత్వ బీజేపీని ఓడించాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

జి.ఈశ్వరయ్య మాట్లాడుతూ సీఏఏను తీవ్రంగా వ్యతిరేకించడంతో 2012లో పక్కనపెట్టిన మోదీ సర్కారు...ఎన్నికల వేళ ఓట్ల కోసం మళ్లీ తెరపైకి తెచ్చిందని విమర్శించారు. 1950 నాటి పౌరసత్వ చట్టానికి అనేక సవరణలు చేశారని, ప్రస్తుత చట్టంలో ముస్లింలతో పాటు ఇతర మైనార్టీ వర్గాలకు అన్యాయం జరుగుతుందన్నారు. రాష్ట్రంలోని వైసీపీ, టీడీపీ సీఏఏకు అనుకూలంగా ఓటు వేసి ముస్లింల హక్కులు కాపాడతామని ప్రగల్భాలు పలుకుతున్నాయన్నారు. సీఏఏను రద్దు చేయాల్సిందేనని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఈదా సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ముస్లింలు ఈ దేశ పౌరులని నిరూపించుకోవాలా అని ప్రశ్నించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్‌డీ హనీఫ్, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ ప్రసంగించారు. సీపీఐ ఎంఎల్ జిల్లా నాయకురాలు ఎస్.లలిత కుమారి, సీపీఎం జిల్లా నాయకులు జాలా అంజయ్య, వై.సిద్దయ్య, జీవీ కొండారెడ్డి, చీకటి శ్రీనివాసరావు, ఏఐకే మాబు, కంకణాల ఆంజనేయులు, కె.రమాదేవి. ఎ.బాల కోటయ్య, బి.రఘురామ్, సిహెచ్ వినోద్, కేఎఫ్ బాబు, ఎస్‌టీ హుస్సేన్, సీపీఐ నాయకులు ఉప్పుటూరి ప్రకాశరావు, ఎ.సర్దార్, సీవీఆర్ చౌదరి, కరవది సుబ్బారావు, వీరారెడ్డి, ఆర్.లక్ష్మి, సీపీఐ ఎంఎల్ జిల్లా నాయకులు సాగర్, ఎల్.రాజశేఖర్, కాంగ్రెస్ నాయకులు యు.మల్లికార్జున రావు, రసూల్, ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి జిల్లా నాయకులు కరిముల్లా, సయ్యద్ ఇస్మాయిల్, ఆసిస్, జోస్, ఖాజా రియాజ్, ముస్లిం సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మహ్మద్ రఫీ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు భాషా బాషా, ముస్లిం సంఘాల నాయకులు, వామపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీ సత్యసాయి తాగునీటి పథకం కార్మికులకు జీతాలు చెల్లించాలి: డేగా ప్రభాకర్

విశాలాంధ్ర-ఏలూరు: శ్రీ సత్యసాయి తాగునీటి పథకం కార్మికులకు జీతాలు తక్షణమే చెల్లించాలని ప్రాజెక్ట్ మెయింటెనెన్స్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డేగా ప్రభాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం జిల్లా రెవెన్యూ అధికారికి ఆయన వినతిపత్రం అందజేశారు. అనంతరం ప్రభాకర్ మాట్లాడుతూ శ్రీసత్య సాయి మంచినీటి పథకం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో నాలుగు నియోజకవర్గాల్లోని 180 గ్రామాలకు గోదావరి జలాలను అందిస్తుందన్నారు. 130 మంది కార్మికులు పనిచేస్తున్నారని, వీరిలో ఎక్కువమంది విద్యావంతులు ఉన్నారని తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గానికి చెందిన వీరు ప్రస్తుతం నాలుగు నెలలుగా జీతాలు అందక దుర్భర దారిద్ర్య పరిస్థితులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లల చదువులు, అనారోగ్య సమస్యలతో ఆసుపత్రికి వెళ్లాలంటే చేతిలో చిల్లిగవ్వ లేక నరకయాతన అనుభవిస్తున్నారన్నారు. కాంట్రాక్టర్ 16 నెలల నుంచి ఈపీఎఫ్, పిఎఫ్ చెల్లించలేదన్నారు. గతంలో ఎల్అండ్‌టీ కంపెనీ నిర్వహించిందని, ఆ తర్వాత ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ నిర్వహించిన క్రమంలో రెండు నెలలతో కలిపి బకాయి ఉందన్నారు. కరోనా కష్టకాలంలో 12 నెలల జీతం చెల్లించ లేదన్నారు. మెయింటెనెన్స్ కాంట్రాక్టర్... ఈ నెల తరువాత వైదొలగుతున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు తెలియజేశారని, ఈ క్రమంలో ప్రభుత్వమే నిర్వాహణ చేపట్టాలని కోరారు. ప్రభుత్వం తక్షణం నిధులు మంజూరు చేసి జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. యూనియన్ కోశాధికారి ఎస్.బాలాజీ, ఉపాధ్యక్షుడు ఎస్. శ్రీకాంత్, ఎ. సత్యనారాయణ, ఎస్. రామకృష్ణ, ఎం. శ్రీనివాస్ పాల్గొన్నారు.

కబ్జా భూములు తిరిగిచ్చేయాలి

వైసీపీ నేతలకు కేఏ పాల్ డిమాండ్

విశాఖ: వైసీపీ నేతలకు ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ హెచ్చరికలు జారీ చేశారు. తన సత్తా ఏమిటో వైసీపీ నేతలకు తెలియదం లేదని పేర్కొన్నారు. కేఏ పాల్‌తో పాటు బాబు మోహన్ శనివారం విశాఖపట్నంలో సీబీసీఎన్‌సీ క్రైస్తవ భూములను సందర్శించారు. అక్కడ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం మాట్లాడిన కేఏ పాల్ విశాఖపట్నంలోని విలువైన భూములను వైసీపీ నేతలు కబ్జా చేశారని ఆరోపించారు. సీబీసీఎన్‌సీ భూముల వందల కోట్ల విలువ చేస్తాయని కేఏ పాల్... ఈ భూములను వైజాగ్ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ కబ్జా చేశారని ఆరోపించారు. ఎంవీవీ వెంటనే మనసు మార్చుకుని ఈ భూములను క్రైస్తవ సంస్థలకు తిరిగి ఇచ్చేయాలని సూచించారు. వారం రోజుల్లోగా భూములు వెనక్కి ఇచ్చేయాలని కేఏ పాల్ సూచించారు. లేకుంటే న్యాయ పోరాటం చేస్తానని చెప్పారు. ప్రధాని మోదీ, అమిత్ షా మీదే కేసులు వేసి గెలిచానని, భూములు వెనక్కి ఇవ్వకపోతే స్థానిక వైసీపీ నాయకులపైనా న్యాయపోరాటం తప్పదన్నారు. తెలంగాణ ఎన్నికలపైనా కేఏ పాల్ స్పందించారు. ప్రజాశాంతి పార్టీ తరుపున వరంగల్ ఎంపీ అభ్యర్థిగా బాబూమోహన్ పోటీ చేస్తారని ప్రకటించినా బీఆర్‌ఎస్ నేతలకు మతులు పుడుతోందన్నారు. అందుకే లేనిపోని వార్తలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. వచ్చే ఎన్నికల్లో ప్రజాశాంతి పార్టీని గెలిపిస్తే ఉచిత వైద్యం, విద్య అందజేస్తామని కేఏ పాల్ హామీ ఇచ్చారు. వైసీపీ, టీడీపీ రెండూ అవినీతి కూరుకుపోయాయని, అవినీతి రహిత పాలన అందించే ప్రజాశాంతి పార్టీకి ఓటువేయాలని పాల్ ఓటర్లను కోరారు.

ఎన్నికల్లో లబ్ధికే సీఏఏ అమలు

మత సామరస్యాన్ని నాశనం చేయడమే మోదీ లక్ష్యం

రౌండ్ టేబుల్ సమావేశంలో అక్కినేని వనజ విమర్శ

విశాలాంధ్ర-రాజమహేంద్రవరం: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మోదీ నాయకత్వంలో పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) అమలు కోసం రాజ్యాంగ నిబంధనను తుంగలో తొక్కిందని, సీఏఏ రాజ్యాంగ వ్యతిరేక చట్టం అని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ విమర్శించారు. స్థానిక సీపీఐ పార్టీ కార్యాలయంలో శనివారం 'పౌరసత్వ సవరణ చట్టం రద్దు-లౌకిక భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందాం' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సీపీఐ జిల్లా కార్యదర్శి టి.అరుణ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన వనజ మాట్లాడుతూ కేంద్రం 2019లో చేసిన పౌరసత్వ సవరణ చట్టాన్ని రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో లబ్ధి పొందడం కోసం ఇప్పుడు అమలు చేస్తుందని ఆమె ఆరోపించారు. ఈ చట్టం దేశంలోని ప్రజలను మతావారీగా విడగొడుతుందని, కుల, మత, ప్రాంతీయ, భాష, వేదాలకు అతీతంగా దేశ పౌరులందరూ చట్టం ముందు సమానమేనని చెబుతున్న భారత రాజ్యాంగానికి విరుద్ధంగా ఈ సవరణ ఉందన్నారు భారతదేశ లౌకిక స్వభావాన్ని నాశనం చేసి దాన్ని నిరంకుశ హిందూ మత రాజ్యంగా మార్చడానికి ప్రయత్నమే ఈ పౌరసత్వ చట్టమన్నారు. దేశంలో మతసామరస్యం ఉండాలని అప్పుడే ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉంటారని ఆమె పేర్కొన్నారు. సీఏఏ దేశాన్ని బలహీనపరుస్తుందని, మత ఘర్షణలు తాండవిస్తాయని ఆమె అన్నారు. ఎన్నికల్లో బీజేపీకి తగిన గుణపాఠం చెప్పాలని, మతాలకు అతీతంగా ప్రజలంతా ఏకం కావాలని, పౌరసత్వం అమలును తిప్పికొట్టాలని ఆమె పిలుపునిచ్చారు.

సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ మాట్లాడుతూ దేశాన్ని ముక్కలు చేసే ప్రమాదకరమైన పౌరసత్వ చట్టాన్ని సమర్థించుకోవడానికి ప్రభుత్వం అనేక కుంటి సాకులు చెబుతుందని ఆయన అన్నారు. 1955 చట్ట ప్రకారం ఈ దేశంలో పుట్టిన ప్రతి వ్యక్తి భారతీయుడేనని తేల్చి చెప్పిందని కానీ బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిన చట్టం కుల, ప్రాంత, లింగ, జాతి, సాంస్కృతికపరమైన వివక్షలకు అతీతంగా భారతీయులందరికీ సమాన పౌరసత్వ హక్కు కల్పించాలన్న రాజ్యాంగ స్ఫూర్తిని తుంగలో తొక్కుతుందని ఆయన అన్నారు. ఏప్రిల్ ఆరున ఇదే అంశంపై సదస్సు ప్రదర్శన నిర్వహిస్తున్నామన్నారు. సీపీఐ ఎంఎల్ న్యూ డెమొక్రసీ జిల్లా నాయకులు చీకట్ల వెంకటేశ్వరరావు, కె.జోజి మాట్లాడుతూ, నరేంద్ర మోదీ ప్రభుత్వం మరోసారి అధికారంలోకి వస్తే రాజ్యాంగంలోని లౌకిక ప్రజాస్వామ్యాన్ని తుంగలో తొక్కుతుందని, హిట్లర్ వంటి నియంతృత్వ పాలన వస్తుందని గుర్తు చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు మాట్లాడుతూ, సాంస్కృతిక రాజధాని రాజమండ్రిలో మతతత్వ బీజేపీ పోటీ చేయడం ఆందోళనకరమైన విషయమని అన్నారు. పార్లమెంటు పరిధిలో అన్ని వర్గాల ప్రజలు బీజేపీకి వ్యతిరేకంగా ఓటు వేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ నేత సత్యనారాయణ, ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ కుండ్రపు రాంబాబు, యునైటెడ్ డెమొక్రటిక్ ఫోరం కన్వీనర్ జహంగీర్, ఐడియల్ యూత్ మూమెంట్ నాయకులు కలీం మల్లా ఖాన్, షాన్ భాష, సీపీఐ నగర కార్యదర్శి వి.కొండలరావు, సీపీఎం నగర కార్యదర్శి బి.పవన్, సీఐటీయూ ప్రధాన కార్యదర్శి వి.రాజులోవ, ఉపాధ్యక్షుడు ఎస్.ఎస్. మూర్తి, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు చింతపల్లి సునీల్, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె. జ్యోతిరాజు, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బి.రాంబాబు, సీపీఎంఎల్ న్యూ డెమొక్రసీ కిరణ్ కుమార్, సీపీఎం సీనియర్ నేత పోలిన వెంకటేశ్వరరావు, కె.రామకృష్ణ, పి.మురళి, సోమేశ్వరరావు, జట్టు సంఘం ప్రధాన కార్యదర్శి సప్పరమణ, దళిత హక్కుల పోరాట సమితి నగర కార్యదర్శి సాగర్, మహిళా సమాఖ్య జిల్లా కో కన్వీనర్ ముత్యాలు, వెంకట్రావు, కళ్ళ అప్పలనాయుడు, భాస్కరరావు పాల్గొన్నారు.

వైసీపీలోకి టీడీపీ, జనసేన కీలక నేతలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో వివిధ నియోజకవర్గాలకు చెందిన టీడీపీ, జనసేన కీలక నేతలు శనివారం వైసీపీలో చేరారు. 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర నిర్వహిస్తున్న అధినేత జగన్‌ను తుగ్గలి వద్ద కలిశారు. కీలక నేతలతోపాటు వారి ముఖ్య అనుచరులను పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పితాని బాలకృష్ణ, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ సాకేటీయ మల్లికార్జున్ సహా జనసేన నేతలు వైసీపీలో చేరారు. పత్తికొండ స్టే పొయింట్ వద్ద జగన్ సమక్షంలో టీడీపీ కళ్యాణదుర్గం నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఉమామహేశ్వరనాయుడు ఆధ్వర్యంలో కీలక నేతలు వైసీపీలో చేరారు. సీనియర్ నేత, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ వై.నారాయణ, మాజీ ఎంపీపీ, టీడీపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ కె.కొల్లప్ప, టీడీపీ పార్లమెంట్ సెక్రటరీ, క్లస్టర్ ఇన్‌ఛార్జి టి. సత్యప్ప, జనరల్ సెక్రటరీ (కంబదూరు) పి.ఆనంద్ చౌదరి, కళ్యాణదుర్గం రూరల్ జనరల్ సెక్రటరీ కె.మల్లికార్జున, జనరల్ సెక్రటరీ (శెట్టూరు) ఆదిశేషు, కళ్యాణదుర్గం రూరల్ ఎంపీటీసీ బి.ఓబయ్య, కంబదూరు మాజీ జెడ్పీటీసీ అభ్యర్థి మంజునాథ్ చౌదరి, శెట్టూరు మాజీ మండల కన్వీనర్ పి.రంగనాథ్ శెట్టిలకు జగన్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

జగన్ హయాంలోనే కాపులకు లబ్ధి: ఆకుల శ్రీనివాస్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: జగన్ హయాంలోనే కాపులకు భారీగా లబ్ధి చేకూరిందని వైసీపీ రాష్ట్ర నాయకుడు, కాపు సామాజిక వర్గ ప్రముఖుడు ఆకుల శ్రీనివాస్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గత చంద్రబాబు ప్రభుత్వం కాపులను మోసగించిందని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా కాపులకు వైసీపీ 31 అసెంబ్లీ సీట్లు ఇస్తే టీడీపీ కూటమి 23 మాత్రమే ఇచ్చిందని (టీడీపీ-14 జనసేన-9) వివరించారు. కాపు, ఉప కులాలకు వైసీపీ ఐదు ఎంపీ సీట్లు ఇస్తే, టీడీపీ కూటమి మూడు మాత్రమే ఇచ్చిందన్నారు. చంద్రబాబు ముసుగులో ఉండటం వల్లే పవన్ కళ్యాణ్ జగన్‌ను వ్యతిరేకిస్తున్నారని పేర్కొన్నారు. కాపులకు చంద్రబాబు చేసిన సాయం రూ.1,340 కోట్లు మాత్రమేనని, జగన్ కాపు నేస్తం కింద ఇచ్చిన సాయం రూ. 2,029 కోట్లు అని వివరించారు. గత 52 నెలల్లో 77 లక్షల మంది కాపు, బలిజ, తెలగ, ఒంటరి కులాల లబ్ధిదారులకు డీబీటీ (22,333 కోట్లు) , నాన్ డీబీటీ (16,914 కోట్లు) కింద రూ.39,247 కోట్ల మేర లబ్ధి జగన్ ప్రభుత్వం చేకూర్చిందని స్పష్టం చేశారు. చంద్రబాబు టీడీపీలో కాపులను ఓటు బ్యాంక్ లా చూశాడని , కానీ జగన్ తన ప్రభుత్వంలో బలమైన కాపుల బొత్స సత్యనారాయణ, అంబటి రాంబాబు, పేర్ని నాని , కన్నబాబు, ముత్తంశెట్టి, గుడివాడ అమర్ నాథ్ వంటి వాళ్లను మంత్రులుగా చేశారన్నారు. జనసేన వల్ల కాపుల ఓట్లు పడతాయని చంద్రబాబు ఆశిస్తాడని, ఎక్కువ సీట్లలో జనసేన ఓటమికి బాబు వెన్నుపోటు పొడుస్తాడని ధ్వజమెత్తారు.

న్యాయవిజ్ఞానానికి వర్క్‌షాప్‌లు దోహదం

హైకోర్టు జడ్జి జస్టిస్ కృష్ణమోహన్

విశాలాంధ్ర-ఏలూరు: న్యాయవిజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి వర్క్‌షాప్‌లు ఎంతగానో దోహదపడతాయని రాష్ట్ర హైకోర్టు జడ్జి, పశ్చిమ గోదావరి జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ బి.కృష్ణ మోహన్ అన్నారు. కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో శనివారం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తమకుమార్ అధ్యక్షతన జిల్లాలోని న్యాయ మూర్తులకు వివిధ అంశాలపై వర్క్‌షాప్ నిర్వహించారు. కృష్ణమోహన్ ఉద్దేశించి న్యాయ అధికారులకు చట్టం స్వభావమైన, విధానపరమైన న్యాయ విజ్ఞానంతో సన్నద్ధం చేయడానికి ఈ వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రిసోర్స్‌పర్సన్‌లుగా సీనియర్ న్యాయవాదులు వై.వి. రవిప్రసాద్, మజ్జి సూరిబాబు, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి ఎస్. సత్యాన్ రాజు వ్యవహ రించారు. పార్టిషన్, మార్ట్‌గేజ్, మనీ, డిక్లరేషన్, ఇంజక్షన్ చట్టాలు ఎప్పటికప్పుడు మారుతున్న సవరణలపై అవగాహన కల్పించారు. కౌలుల కృష్ణమోహన్ జిల్లా కోర్టు ప్రాంగణంలో పోలీస్ గౌరవవందనం స్వీకరించారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తమ్, మొదటి అదనపు జిల్లా జడ్జి జి.రామగోపాల్, ఏలూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ. విజయ్ కుమార్, న్యాయవాదులు స్వాగతం పలికారు. కక్షిదారుల సౌలభ్యం నిమిత్తం ఏర్పాటు చేసిన లిఫ్టును, సౌర విద్యుత్తును, కోర్టు హాలులో ఏర్పాటు చేసిన ఎయిర్ కండిషన్‌ను కృష్ణమోహన్ ప్రారంభించారు.

మచిలీపట్నం కూటమి అభ్యర్థి బాలశౌరి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: మచిలీపట్నం లోక్‌సభ స్థానం నుంచి జనసేన అభ్యర్థిగా వల్లభనేని బాలశౌరిని ఆ పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఖరారు చేశారు. తెలుగుదేశం పార్టీ, బీజేపీతో పొత్తులో భాగంగా జనసేన 21 శాసనసభ స్థానాలు, రెండు లోక్‌సభ స్థానాలకు పోటీ చేస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే కాకినాడ పార్లమెంటుతో పాటు 19 అసెంబ్లీ నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించి చింది. అవనిగడ్డ, పాలకొండ స్థానాలకు అభ్యర్థుల పేర్లను ఇంకా ఖరారు చేయలేదు. అవని గడ్డలో ఆశావహులు ఎక్కువగా ఉన్నందున అక్కడ సర్వే జరిపి, ఫలితాల వచ్చిన తర్వాత అభ్యర్థిని ప్రకటిస్తారని జనసేన అధ్యక్షుడి రాజకీయ కార్యదర్శి పి.హరిప్రసాద్ తెలిపారు.

కూ... బండి...

విశాలాంధ్ర-గుంటూరు: రైలు ప్రయాణం బతుకుజీవుడా అన్నట్లు ఉంది. బహుశా మోదీ చెబుతున్న 'ఆజాదీకి అమృత్' అంటే ఇదే నేమో అన్న అనుమానమూ వెంటాడింది. రైల్వేశాఖ నిర్లక్ష్యం ప్రయాణికులకు శాపంగా మారింది. రైళ్లు గంటలకొద్దీ ఆలస్యంగా నడుస్తున్నాయి. ప్రయాణికులకు ముందు సమాచారం ఉండదు. రిజర్వేషన్ బెర్త్‌ల్లో ఎక్కి కూర్చున్న రైల్వే సిబ్బంది ఎందుకు బాతాఖానీ కొడతారో తెలియదు. వెరసి రేల్వేశాఖ నిర్వాకం ప్రయాణికులకు తలనొప్పిగా మారింది. రైళ్లు రెండుమూడు గంటలు ఆలస్యమైతే..ఎన్నిగంటలకు బయల్దేరుతుందో రిజర్వేషన్ చేసుకున్న ప్రయాణికులకు ముందస్తు పక్కా సమాచారం ఉండదు. దీంతో ప్రయాణికులకు సమయపాలనపై ఓ కట అగాహన ఉండే వీలుండదు. రైలు రెండుమూడు గంటలు ఆలస్యంగా వస్తుందని ముందే తెలిస్తే ఆ సమయం సద్వినియోగం చేసుకునేవారికి అది ఎంతో విలువైనదిగా ఉండేది. ఇక్కడా ఖచ్చితమైన సమాచారం ముందుగా ప్రయాణికులకు రావడంలేదు. ప్రయాణికులకు అర్థంకాక తలలు పట్టుకుంటున్నారు. 28-3-2024న సికింద్రాబాద్ నుంచి రేపల్లెకు వెళ్లవలసిన 17645 డెల్టా ఎక్స్‌ప్రెస్ మధ్యాహ్నం 12.40కు ప్లాట్‌ఫామ్ ఐదు నుంచి బయలుదేరాలి. కానీ, కారణం ఏమిటో తెలియదు. విచారణలో అడిగితే రైలు 1.10కి వస్తుందని చెప్పారు. ఆ సమయానికీ రైలు రాలేదు. 1.30కు వచ్చింది . 2.10కు బయల్దేరింది. రైల్ టైమ్‌కు బయల్దేరుతుందని భావించి చాలామంది భోజనం కూడా తినకుండా రైల్వే స్టేషన్‌కు 12.20కే సీనియర్ సిటిజన్స్, పిల్లలు, మహిళలు, వృద్ధులు చేరుకున్నారు. ఫలితంగా తిరిగి సాయంత్ర అర గంటకు గుంటూరు చేరవలసిన ఈ రైలు 7.58కు వచ్చింది. అంటే రెండు గంటల ఆలస్యం అన్నమాట. తెనాలికి 8. 45, రేపల్లెకు 9.28కు చేరింది. అంటే దాదాపు రెండు గంటల ఆలస్యంగా మొత్తం ప్రయాణం సాగింది. ఇదిలా ఉండగా, రామన్నపేట వద్ద సుమారు 10 నుంచి రైళ్లే విద్యుత్ ట్రాక్షన్ సిబ్బంది హఠాత్తుగా ఎస్ 1 బోగీలో ఎక్కి రిజర్వేషన్ బెర్త్‌ల్లో కూర్చున్నారు. దీంతో ఇబ్బందికి గురైన సీనియర్ సిటిజన్స్... తాము కాసేపు విశ్రమించడానికి, కళ్ళు వాల్చుకోడానికి ఇబ్బందిగా ఉందని చెప్పినా... ఏం ఫర్వాలేదు, తాము రైల్వే ఉద్యోగులం అని చెప్పి రాత్రి ఏనిమిది గంటలకు గుంటూరు చేరే దాకా దిగలేదుసరికదా.... పెద్దగా మాట్లాడుతూ, పగలబడి నవ్వుతూ, పనికిమాలిన కబుర్లతో ప్రయాణికులకు అసౌకర్యం కలిగించారు. పోనీ టీటీఈకి చెబుతామంటే... ఆయన గారు అసలు ఇటు రానేరాలేదు.

విశాఖలో నేడు ఐపీఎల్ సంబరం

- ఢిల్లీ క్యాపిటల్స్-చెన్నై సూపర్ కింగ్స్ మధ్య రాత్రి 7 గంటలకు
- ప్రత్యేక ఆకర్షణగా ధోని...
- ఆనందంలో మునిగితేలుతున్న క్రీడాభిమానులు



విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: విశాఖ ఆదివారం క్రీడా సంబరానికి వేదికైంది. ఇప్పటికే ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌కు క్రీడాకారులు విశాఖ చేరుకున్నారు. ఢిల్లీ క్యాపిటల్స్-చెన్నై సూపర్ కింగ్స్ మ్యాచ్‌లో ధోని ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నారు. క్రీడాభిమానులు పెద్ద ఎత్తున ఈ సంబరాన్ని చూడడానికి ఎగబడుతున్నారు. టికెట్లు దొరకపోవడంతో ఎంతోమంది క్రీడాభిమానులు బ్లాక్‌లో టికెట్లు కొనుక్కుంటూ స్టేడియం వద్ద పడిగాపులు కాస్తున్నారు. పీఎం పాలెం ఏసీఏ వీడీసీఏ అంతర్జాతీయ స్టేడియాన్ని ఇప్పటికే సుందరంగా ముస్తాబు చేశారు. ఐదేళ్ల తర్వాత విశాఖకు ఐపీఎల్ మ్యాచ్ ను కేటాయించడంతో క్రీడాభిమానులు ఆనందంలో మునిగి తేలుతున్నారు. గతంలో విశాఖలో ధోని పాక్ పై చేసిన పరుగుల వరదను అభిమానులు ఇప్పటికీ మర్చిపోలేరు. రెండు ఐపీఎల్ మ్యాచ్‌లు జరుగుతుంటే, ఆదివారం రాత్రి ఏడు గంటలకు జరుగనున్న సీఎస్ కే మ్యాచ్ కే ఎక్కువ ఆదరణ లభిస్తుంది. ఢిల్లీ క్యాపిటల్స్, చెన్నై సూపర్ కింగ్స్, కోల్‌కత్తా నైట్ రైడర్స్ జట్లు గతంలో కూడా విశాఖలో జరిగిన ఈ ఐపీఎల్ మ్యాచ్‌లపై తీవ్ర క్రేజ్ నెలకొంది. విశాఖ నగరానికి చెందిన రిక్కీ భుయ్ ఢిల్లీ క్యాపిటల్స్ జట్టులో ఉన్నారు. ఎంఎస్ ధోని, టెస్ట్ క్రికెటర్ కేఎస్ భరత్ కోల్‌కత్త నైట్ రైడర్స్ జట్టులో ఉన్నారు. ఎంఎస్ ధోనీ, రిషబ్ పంత్, సమీర్ రిజ్వి, రుతురాజ్ గైక్వాడ్, రహానే, షేక్ రషీద్, రవీంద్ర జడేజా, మిచ్చెల్, శివం దుబే, అవినాష్ రావు, రాజవర్ధన్, దీపక్ చాహర్, ప్రశాంత్ సోలంకి, నిశాంత్ సింధు, రచిన్ రవీంద్ర, శార్దూల్ ఠాకూర్, దేశ్ పాండే నెట్ ప్రాక్టీస్ చేశారు. ఏప్రిల్ మూడున ఢిల్లీ క్యాపిటల్స్-కోల్‌కత్త నైట్ రైడర్స్ జట్ల మధ్య మ్యాచ్ జరుగనుంది.

విశాలాంధ్ర

ఆదివారం 31, మార్చి 2024

సంపాదకీయం

బ్రహ్మాస్త్రంగా మారిన పన్ను

ప్రతిపక్షాల మీద దాడి చేయడానికి, బీజేపీని వ్యతిరేకించే పార్టీలన్నింటినీ అపఖ్యాతి పాలు చేయడానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతిలో నాలుగైదు ఆయుధాలు ఉండేవి. మోదీ కాంగ్రెస్‌ను ప్రధాన శత్రువుగా భావిస్తారు కనక వంశపారంపర్య పాలన అని దెప్పి పొడిచేవారు. ప్రతిపక్షాలన్నీ అవినీతిలో మునిగి తేలుతున్నాయనే వారు. కేంద్ర ప్రభుత్వ అధీనంలోని సీబీఐ, ఆదాయపు పన్ను శాఖలో అంతర్భాగమైన ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ (ఇ.డి.) చేత ఎడాపెడా దాడులు చేయించారు. ద్రవ్య అక్రమ చెలామణి చట్టం కింద కేసులు నమోదు చేశారు. ఇప్పుడు కొన్ని రాజకీయ పార్టీలు తమ ఆదాయ వివరాలను సవ్యంగా చూపలేదన్న సాకుతో కాంగ్రెస్, సీపీఐ, సీపీఎంకు ఆర్థికశాఖ నోటీసులు జారీ చేసింది. అంటే పన్ను కూడా మోదీ అమ్ములపొదిలో ఓ అస్త్రం అయింది. శుక్రవారం జారీచేసిన నోటీసుల ప్రకారం కాంగ్రెస్ రూ.1823 కోట్ల జరిమానా చెల్లించాలి. 14 కోట్ల జరిమానా చెల్లించాలని ఇదివరకే కాంగ్రెస్‌కు నోటీసు అందింది. ఇలా నోటీసు జారీ చేయడమే ఇదివరకు ఎన్నడూ లేనిది. అన్ని రాజకీయ పార్టీలకు ఆదాయపు పన్ను నుంచి మినహాయింపు ఉన్నా ఆదాయపు పన్ను శాఖకు లెక్కలు మాత్రం చూపించాలి. ఇప్పటికే కాంగ్రెస్ కు చెందిన 11 బ్యాంకు ఖాతాలను స్తంభింపచేశారు. అంటే ఆ ఖాతాల నుంచి ఆర్థిక లావాదేవీలు నిర్వహించడానికి వీలులేదు. ఈ ఖాతాల్లో ఉన్న దాదాపు 200 కోట్ల రూపాయలను కాంగ్రెస్ వాడుకోవడానికి వీలు లేదు. జరిమానా చెల్లించాలని కాంగ్రెస్‌కు జారీ చేస్తున్న నోటీసులన్నీ ఇటీవలి లెక్కల్లో లోపాలు ఉన్నందుకు కాదు. పాత వివరాలను తవ్వితీసి జరిమానా విధించారు. 2019లో కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు ఇచ్చిన రూ.14 లక్షల విరాళాల లెక్కలు సవ్యంగా లేవని ఆరోపించి రూ.135 కోట్ల జరిమానా విధించారు. ఇది విచిత్రాల్లోకెల్లా విచిత్రం. ఎందుకంటే లెక్కలు సరిగ్గా లేవంటున్న మొత్తం లక్షల్లో ఉంటే జరిమానా కోట్లలో ఎలా ఉంటుందో దీనికి లెక్క ఏమిటో అంతు పట్టదు. పైగా పునర్మదింపు ఆధారంగా ఈ జరిమానా విధించినట్టు ఆదాయపు పన్ను శాఖ చెప్తోంది. అంటే మొదట ఆదాయపు పన్నుశాఖ అధికారులే సరిగ్గా అంచనా వేయలేక అసమర్థత చాటుకున్నారా? అలాంటప్పుడు చర్య వారి మీద ఉండాలి. అలా కాకుండా లెక్కలు చూపవలసిన పక్షానికి కనీ వినని రీతిలో జరిమానా విధించడం మోదీ మార్కు నియంతృత్వంలోని మరో కోణం కావచ్చు. పైగా ఈ లోపాన్ని కనిపెట్టడానికి ఆదాయపు పన్ను శాఖకు అయిదేళ్లు ఎందుకు పట్టినట్టో! త్వరలో సార్వత్రిక ఎన్నికలు జరగడమే దీనికి కారణం కావచ్చు. 1993-94 సంవత్సరానికి రూ.54 కోట్లు, 2016-17 సంవత్సరానికి రూ.182 కోట్లు, 2017-18 సంవత్సరానికి రూ.179 కోట్లు, 2018-19 సంవత్సరానికి 918 కోట్లు, 2019-20 సంవత్సరానికి రూ.480 కోట్లు జరిమానా విధించారు. ఇంత ఆలస్యంగా జరిమానా విధించడానికి ఆదాయ పన్ను శాఖ అసమర్థత కారణం అయి ఉండాలి. లేకపోతే ఎన్నికలు జరగనున్న తరుణంలో కాంగ్రెస్ చేతిలో డబ్బు లేకుండా మాడ్చి ఆ పార్టీని అశక్తం చేయాలన్న మోదీ ప్రభుత్వ ఎత్తుగడన్నా అయి ఉండాలి. రెండో కారణమే ప్రధానం అనిపిస్తోంది. 2019 ఎన్నికలలో కాంగ్రెస్ ధారాళంగా డబ్బు ఖర్చు చేసిందని ఆదాయపు పన్ను శాఖ నిర్ధారణకు వచ్చిందట. అందుకే 2018-19 సంవత్సరానికి ఆదాయపు పన్ను నుంచి మినహాయింపు ఇవ్వకుండా పైగా భారీ మొత్తంలో జరిమానా విధించారు. ఆ తరవాత 2014-15 నుంచి 2020-21 లెక్కలు తవ్వి తీయడం మొదలు పెట్టారు. దీనంతటి వెనక భారీ కుట్ర కనిపిస్తూనే ఉంది.

ఆదాయపు పన్ను శాఖను పరిచారికగా చేసుకుని వేధించడం కాంగ్రెస్‌కు మాత్రమే పరిమితం కాలేదు. సిపీఐ, సీపీఐ(ఎం), తృణమూల్ కాంగ్రెస్ మీద కూడా ఇదే అస్త్రం ప్రయోగించారు. పాత పాన్‌కార్డు వినియోగించారన్న ఆరోపణపై సీపీఐకి నోటీసు పంపించారు. 2016-17లో ఒక బ్యాంకు ఖాతాను ఆదాయపు పన్ను రిటర్నులలో పేర్కొననందుకు సీపీఐ(ఎం) కు రూ.15.59 కోట్ల జరిమానా విధించారు. తృణమూల్ కాంగ్రెస్‌కు కూడా దాదాపు డజను నోటీసులు అందాయట. ప్రతిపక్షాలను వేధించడానికి నోటీసుల మీద నోటీసులు పంపుతున్న ఆదాయపు పన్ను శాఖ ఇవే కొలమానాలను బీజేపీ మీద వినియోగించడం లేదు. ప్రతిపక్షాల మీద వినియోగించిన కొలమానాల ప్రకారమే చూస్తే బీజేపీ మీద రూ.4,617.58 కోట్ల జరిమానా విధించవలసి వస్తుంది. ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్ ప్రకారం 2017-18లో బీజేపీ అందుకున్న 92 విరాళాల దాతల పేర్లే లేవు. ఈ మొత్తం రూ.4.5 లక్షలు. అలాగే 1297 మంది దాతలనైతే చూపించారు కాని వారి చిరునామాలు లేవు. పేరు లేని దాతలు కొందరు, పేరు ఉన్నా చిరునామా లేని దాతలు మరికొందరు. ఇదీ బీజేపీ తంతు. కానీ ఆదాయపు పన్నుశాఖకు ఈ లోపాలేమీ కనిపించవు. ఆదాయపు పన్నుశాఖ చట్టంలోని 13వ సెక్షన్ ప్రకారం రాజకీయ పార్టీలు ఆదాయపు పన్ను చెల్లించనక్కర్లేదు. కానీ జరిమానాలు మాత్రం బీజేపీని వ్యతిరేకించే పార్టీలకే విధిస్తున్నారు. అదీ లెక్కా పత్రం లేకుండా. ఏ పొరపాటుకు ఏ మేరకు జరిమానా విధించవచ్చో ఆదాయపు పన్ను చట్టంలో నిర్దిష్టంగా ఉంటుంది. మోదీ ప్రభుత్వ పనుపుపైన అయినా అడ్డగోలుగా జరిమానాలు విధించడానికి వీలు లేదు. కానీ మోదీ రాజ్యంలో ఏమైనా జరగొచ్చు. సకల దర్యాప్తు సంస్థలు బీజేపీకి అనుబంధ విభాగాలుగా పని చేస్తున్నాయి. వీటి ఆధారంగా ప్రత్యర్థి పక్షాల మీద కసి తీర్చుకుంటున్నారు. ఎన్నికలకు ముందు లెక్కా పత్రం, హద్దూ పద్దూలేని రీతిలో జరిమానాలో విధించి ప్రతిపక్షాలను అపఖ్యాతిపాలు చేయడానికి మోదీ ప్రభుత్వం కంకణం కట్టుకుంది. ఎన్నికల బాండ్ల రూపంలో రూ.850 కోట్లు పోగేసుకోవడమే కాకుండా ఇతరత్రా విరాళాలను కూడా కలిపితే బీజేపీ ఖాతాకు రూ.1250 కోట్లకు పైగానే చేరాయి. మోదీ రంగంలోకి వచ్చిన తరవాతే ఎన్నికల వ్యయం విపరీతంగా పెరిగి పోయింది. 2019 ఎన్నికలలో మన దేశంలో ఖర్చు అయినంత డబ్బు ప్రపంచంలో ఏ దేశంలోనూ వెచ్చించలేదంటున్నారు. ఆదాయంలోనూ బీజేపీదే అగ్రస్థానం, చేతికి ఎముక లేనట్టుగా బీజేపీ ఖర్చు పెడ్తుంది. కానీ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మాత్రం తన దగ్గర ఎన్నికల్లో పోటీ చేయడానికి అవసరమైన డబ్బులు లేవని పేద అరుపులు అరుస్తున్నారు. చోద్యం అంటే ఇదే. తాము ఎంత అబద్ధం ఆడినా జనం నమ్మేస్తారన్న నమ్మకం మోదీ మెదడులో బాగా నాటుకు పోయింది. అబద్ధాలను జనానికి అంతగా అలవాటు చేసిన ఘనాపాటి ఆయన. పన్ను కూడా మోదీ చేతిలో బ్రహ్మాస్త్రమే.

మోదీ బుర్రాట

బుర్రాట అంటే ఏమిటా అని బుర్ర గోక్కోకండి. అందరికీ తెలిసిన మాటే. 'మైండ్ గేమ్' అని రోజూ వింటున్నదే. దీనిని కొందరు మానసిక యుద్ధం అంటున్నారు. ఈ మాటను ఒక్కసారి పట్టిపట్టి చూడండి. 'మానసిక యుద్ధం'లో మైండ్ లేదు. గేమ్ కాస్త యుద్ధం అయ్యింది. మైండ్ గేమ్ కూడా యుద్ధం లాంటిదే. కాని యుద్ధం కాదు. యుద్ధతంత్రంలో వినియోగపడే ఒక పాచిక . అందుకే దీనిని బుర్రాట అనడమే సబబు. బుర్రాటలో వున్నది లేనట్లు, లేనిది ఉన్నట్టు కనిపిస్తుంది. మొదట బుర్రలో ఒక ఆశ్చర్యాన్ని, అనుమానాన్ని ప్రవేశపెడుతుంది. చిన్న సందు దొరకగానే అది మన బుర్రలో తిష్టవేస్తుంది. మన బుద్ధిని స్వాధీనం చేసుకుంటుంది. ఇలా పరకాయ ప్రవేశం చేసినవాడు చెప్పినట్లే మన బుద్ధి పనిచేస్తుంది. వాడు తలపెట్టిన కార్యాన్ని చేసి పెడుతుంది. ఇదొక దొంగల కళ. దుర్నీతిపరుల కళ.

బుర్రాట ఈ నాటిది కాదు. గతాన్ని వెదకండి. ఎన్నో బుర్రాట కథలు కనిపిస్తాయి. పంచతంత్రంలో 'బ్రాహ్మణుడు-నల్లమేక' కథ అందరికీ తెలిసిందే ! ఈ కథలో నిత్యాగ్నిహోత్రుడైన మిత్రశర్మ యజ్ఞం చేయాలని పక్క ఊరులో వున్న భక్తుని ఇంటికి వెళ్లి ఒక మేకను దానంగా పొందుతాడు. మేకను ఇంటికి తోలుకుపోతున్న బ్రాహ్మణుడి మీద ముగ్గురు దొంగలు బుర్రాట మొదలు పెడతారు. మొదటి దొంగ

కుక్కని ఎందుకు తీసుకుపోతున్నారని బ్రాహ్మణున్ని పలకరిస్తాడు. బ్రాహ్మణుడు నమ్మలేదు కాని శంక మొదలవుతుంది. తర్వాత రెండో, మూడో దొంగ కూడా అది కుక్కే అనడంతో బ్రాహ్మణుడు కూడా అది కుక్కే అని దానిని వదిలేస్తాడు. దొంగలకు తాము చెప్పింది అబద్ధం అని తెలుసు. ఈ అబద్ధాన్ని బ్రాహ్మణుడు నిజం అనుకునేలా చేసింది దొంగల బుర్రాట.

2024 ఎన్నికల కోసం మోదీ బుర్రాట మొదలెట్టారు. 'మళ్లీ మేమే అధికారంలోకి వస్తాం' 370 సీట్లు మేమే గెలుచుకుంటాం' పట్టాభిషేకం తర్వాత '100 రోజులలో చేసే ప్రణాళిక సిద్ధం' చేస్తున్నాం అంటూ మోదీ ప్రచార సభలలో మోత మోగిస్తున్నారు. మోదీ బుర్రాటకి గోదీ మీడియా పరవశిస్తున్నది. సీట్ల మీద చర్చ, సర్వేల మీద సర్వేలు, 100 రోజుల ప్రణాళిక మీద ఊహాగానాలు సోషల్ మీడియాలో పరుగులు తీస్తున్నాయి. 'ఆలూ లేదు, చూలూ లేదు, కొడుకు పేరు సోమ లింగం' అన్నట్లు ఎన్నికలు జరగలేదు. ప్రజలు తీర్పు ఇవ్వలేదు. మోదీ పట్టాభిషేకం జరగలేదు. కాని బుర్రాటలో అన్నీ జరిగిపోయినట్లు కనిపిస్తాయి. బుర్రాట అంటే ఉన్నది లేనట్లు, లేనిది ఉన్నట్లు భ్రమింపజేయడమే. ఈ ఎన్నికల్లో మోదీకి పరాజయ శకునాలు కనిపిస్తున్నట్లున్నది. అందుకే కనిపించే పరాజయం లేనట్లు, లేని ఘన విజయం వున్నట్లు చూపించే బుర్రాట సాగిస్తున్నారు. 2019లో మోదీకి వచ్చిన ఓట్లు 38 శాతం కూడా లేవు. కాని కొల్లగొట్టిన సీట్లు 303. అప్పుడు ప్రతిపక్షాలు ఒక్కటిగా లేవు. మోదీని జాతీయస్థాయిలో సవాలు చేసే నాయకులు లేరు. అదొక ఏకపక్ష ఎన్నిక. నల్లేరు మీద బండిలా మోదీ జైత్రయాత్ర సాగింది. ఇప్పుడు పరిస్థితి తల్లకిందులైంది. ప్రతిపక్షాల ఇండియా కూటమి ఏర్పడింది. మోదీని జాతీయస్థాయిలో, రాష్ట్రాల స్థాయిలో నిలదీసి సవాలుచేసే నాయకత్వం వచ్చింది. అందుకే మోదీ తన బుర్రాటతో రాబోయే అప జయాన్ని మాయంచేసి తన అఖండ విజయాన్ని ప్రత్యక్షం చేయిస్తున్నారు. మోదీకి 370 సీట్లు, ఎన్‌డీఏకు 400 సీట్లు వస్తాయంటూ చేస్తున్న ప్రచారం అంతా డొల్లగా కనిపిస్తోంది. ఎక్కడ నుంచి వస్తాయో చెప్పరు. ఏ రాష్ట్రాల్లో వస్తాయో చెప్పరు. ఎందుకు వస్తాయో చెప్పరు. దేశాన్ని, రాష్ట్రాలని ఒకసారి పరికించి చూడండి. గతంలో బీజేపీ గెలిచిన స్థానాలకంటే ఎక్కువ సీట్లు వచ్చే రాష్ట్రాలు ఒకటో అరో తప్ప కనిపించవు. మోదీకి సీట్లు నికరంగా తరిగే రాష్ట్రాలు 20కి పైనే కనిపిస్తాయి. 70 సీట్లు పెరగడం మాట అటుంచి 100 సీట్లు గల్లంతు అయ్యే అవకాశం కనిపి స్తోంది. ఇప్పుడు మోదీ బృందం సామాన్య ప్రజలకు, రైతులకు, కార్మికు లకు, మహిళలకు చేసిందేమిటో చెప్పగల స్థితిలో లేదు. వారు రామా లయం మీద ఆశలు పెట్టుకున్నారు. పౌరసత్వం చట్టం మీద, యూనిఫాం సివిల్ కోడ్ మీద, మెజారిటీ మత జాతీయవాదం మీద, విద్వేష రాజ కీయం మీద ఆధారపడుతున్నారు. భావోద్రేక సమస్యలకు ప్రజలు ఓట్లు ఎల్లకాలం కురిపించరు.

వాస్తవానికి ఎన్నికలు పార్టీల మధ్య ఆట కాదు. ఎన్నికలంటే పార్టీలు ఆడే బుర్రాటలూ కాదు. ఎన్నికలు ప్రజలు ఆడాల్సిన ఆట. పాలకుల నిర్వాకం మీద ప్రజలు తీర్పు చెప్పే ఆట. తమ జీవితాలతో ఆటలాడు తున్న వారి ఆటకట్టించే ప్రజల ఆట. ప్రజలు ఎన్నికలను తమ ఆటగా భావిస్తే రాజకీయం మారిపోతుంది. ప్రజల నిత్య జీవిత సమస్యలు, వారి కష్టసుఖాలు తెర ముందుకొస్తాయి. చర్చ ప్రజలు కేంద్రంగా నడుస్తుంది. అప్పుడు బుర్రాటలన్నీ గాలి బుడగల్లా పేలిపోతాయి.

\- సవ్యసాచి

మోదీనామిక్స్ .... మసిపూసి మారేడుకాయ!

డా.కొప్పరపు నారాయణ మూర్తి

ఇటీవల భారత ప్రభుత్వ ఆర్థికశాఖ విడుదల చేసిన గణాంకాల ప్రకారం భారత్ మార్చి నెలాఖరు నాటికి 6.4 శాతం జీడీపీ సాధించిందిట. అయితే, ఆ ప్రకటనపై వెంటనే స్పందించిన ప్రముఖ ఆర్థికశాస్త్రవేత్త అరవింద సుబ్రహ్మణ్యం 'ఆ లెక్కలు చాలా అయోమయంగా ఉన్నాయని, ఇంకా చాలా స్పష్టత ఉంటే కానీ అవి సరైనవా, కాదా చెప్పటం కష్టం' అని వ్యాఖ్యానించటం గమనార్హం. అరవింద సుబ్రహ్మణ్యం 2014-2018 మధ్యలో ఇదే బీజేపీ ప్రభుత్వానికి ప్రధాన ఆర్థిక సలహాదారుగా పనిచేసిన విషయం మనం ఇక్కడ మరిచి పోకూడదు. ఈ ఏడాది ఫిబ్రవరి 7, 2024 న పార్లమెంటు లో ప్రస్తుత బీజేపీ ప్రభుత్వ ఆర్థిక పరిస్థితిపై చర్చ సందర్భంగా ఎన్నో ముఖ్యమైన విషయాలు బయట పడ్డాయి. బీజేపీ ప్రభుత్వం అధికారం చేపట్టేనాటికి, అంటే 2014లో, భారతదేశం 2.05 ట్రిలియన్ డాల్లర్ల విలువైన మార్కెట్ పరిమాణం కలిగిఉంది. అప్పటికి మన దేశం మొత్తం అప్పు 55.87 లక్షల కోట్ల రూపాయలు. నాటి జీడీపీ 7. 41 శాతం. అంటే ఏటా 1.2శాతం శాతం జీడీపీలో మార్పు వచ్చేది. ప్రస్తుతం భారత దేశ మార్కెట్ పరిమాణం 3. 75 ట్రిలియన్ డాలర్లు. అయితే 2024 లో మన మొత్తం అప్పు 2014 నాటి అప్పుకు మూడు రెట్లు పెరిగింది. 2014-2024 మధ్యకాలంలో ఒక్క 2020లో తప్ప మన జీడీపీ ఎప్పుడూ యూపీఏ ప్రభుత్వం పాలన మోదీకి అప్పగించేనాటికన్నా తక్కువగానే ఉందన్నది ఆర్థిక శాఖ చెప్పే గణాంకాలు. 21-22లో 7.0శాతం, 20-21లో 9.5శాతం (కోవిడ్ సమయంలో), 19-20లో -5.83శాతం, 18-19లో 3.87శాతం అని గణాంకాలు చెబుతు న్నాయి. 2019-20లో మన ఆర్థిక లోటు ఏడు లక్షల అరవై ఆరు వేల ఎనిమిదివందల ఎనభై ఆరు కోట్ల రూపాయలుంటే, 20-21నాటికి మన ఆర్థిక లోటు పద్దెనిమిది లక్షల నలభయి ఎనిమిదివేల ఆరు వందల యాభై కోట్లు. అంటే మన జీడీపీ ప్రగతి 6.4శాతం అప్పులనుంచీ వచ్చిందన్నమాట, ఆదాయం నుంచి కాదు. ఆర్థిక శాఖ గణాంకాలిట్లుంటే, మోదీ భారత దేశాన్ని తనే ప్రపంచంలోని మూడవ ఆర్థిక శక్తిగా మారుస్తున్నట్టు ఉపన్యాసాలు దంచుతుంటాడు. మోదీ ప్రభుత్వం పాలించిన ఈ దశాబ్ద కాలంలో దేశంలో ఉత్పత్తి రంగంలో ఒక్క కొత్త పరిశ్రమా రాలేదు. యూపీఏ ప్రభుత్వం గద్దె దిగేనాటికి ఎన్ని సెంట్రల్ యూనివర్సిటీలు ఉన్నాయో తరువాత కాలంలోనూ అన్నే ఉన్నాయి. కొత్తగా ఏర్పడిన ఆంధ్రా , తెలంగాణాలో విభజన చట్టం ప్రకారం ఏర్పరచిన విద్యా సంస్థలకు సమగ్ర రూపం ఇవ్వటంలోనే పుణ్య కాలమంతా గడిచిపోయింది. ఇంకా వాటిల్లో అన్ని విభాగాలు ఏర్పడలేదు. అధ్యాపకుల నియామకాలు జరగలేదు. తెలంగాణలో పెడతామన్న ఎయిమ్స్, ఆంధ్రాలో పెట్టిన ఎయిమ్స్ ఇంకా పూర్తిస్థాయిలో పనిచేయటం ఆరంభం కాలేదు. ఈ లోపలే వాటిని జాతికి అంకితం ఇచ్చేశాడు మోదీ. ఇక ప్రభుత్వరంగ పరిశ్రమల నుంచి ప్రభుత్వ వాటాల ఉపసంహరణ ఉధృతిగా ఆరంభం అయింది. అందులో భాగంగానే ఆంధ్రాలో (నాడు ఉమ్మడి రాష్ట్రంలో) ఉన్న విశాఖ స్టీల్ ప్లాంటుకు మంగళం పాడే కార్యక్రమం ప్రారంభించారు. విభజన చట్టం ప్రకారం ఇవ్వాల్సిన ఖాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, మణుగూరు స్పాంజ్ ఐరన్, విశాఖ రైల్వే జోన్ అన్ని నీటిమీద రాతలు లాగానే అలలపై ఊగిసలాడుతూ, ఎక్కడికో కొట్టుకుపోతున్నాయి. కేంద్ర ప్రభుత్వంలో ఉద్యోగులకు ఇవ్వవలసిన జీతభత్యాల విషయంలో, పెన్షన్ వసతి కల్పించే అంశంలోనూ మోదీ వైఖరి 'ఎంత తక్కువ భారంలో పని జరిగితే అంత మంచిదనే' టట్టు గానే ఉంది. సీపీఎస్ విధానంలో కూడా ప్రభుత్వం ఎన్పీఎస్‌కు తన వాటా చెల్లించాల్సి ఉంటుంది. అందువల్లనే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు పూర్తిగా నిలిపివేశారు మోదీ. ఆఖరుకు సైన్యం నియామ కాలలో కూడా (అగ్నిపథ్/అగ్ని వీర్ పథకం) కేవలం నాలుగు సంవత్సరాలకే పరిమితమయ్యే సేవా నియమాలు రూపొందించారు. పీవీ నరసింహారావు తెచ్చిన ఆర్థిక సంస్కరణల వల్లనే భారత దేశం నేడు మూడవ అతిపెద్ద మార్కెట్ గా అవతరించనున్నదే తప్ప, మోదీ ఏదో చేసినందువల్ల కాదు. ఈ విషయం మోదీకి బాగా తెలుసు. అందుకే పీవీకి భారత రత్న ఇచ్చారు. కోవిడ్ సమయంలో భారత దేశం అంతా లాక్‌డౌన్ విధించి ప్రజలను కదలకుండా చేశారు. అదే సమయంలో అత్యవసర ప్రయాణాలకు ప్రత్యేక రైళ్లను నడిపారు. వాటిని 'స్పెషల్స్' అని పిలిచి వాటి ధరలను రెండు రెట్లు పెంచేశారు. పాసింజర్ రైళ్లను రద్దుచేసి వాటి బదులు అన్ని రైళ్లు ఎక్స్‌ప్రెస్ రైళ్లే అని మార్చి కనీస చార్జీలు పది రూపాయల నుంచి ముప్పయి రూపాయలకు పెంచి సామాన్యుడి నడ్డి అమాంతంగా విరిచేశాడు. అన్ని వర్గాల రైలు కన్సెషన్స్ రద్దు చేశాడు. లాక్‌డౌన్ రెండేళ్ల కాలంలో జమ కూడిన డబ్బుతో కొత్తగా వందేభారత్ రైళ్లను పట్టుకొచ్చాడు. ఇంతవరకూ (అంటే డిసెంబర్ 30, 2023) 37 వందే భారత్ రైళ్లు పట్టాలపైకి వస్తే, అన్నిటినీ మోదీనే ప్రారంభిస్తాడు. పోనీ ఈ రైళ్లు మామూలు మెయిల్, రాజధాని ఎక్స్‌ప్రెస్ కన్నా గొప్పవా అంటే ఏ విషయం లోనూ కాదనే జవాబు వస్తుంది. మొదట్లో వందే భారత్ వేగం గంటకు 150-160 కి.మీ ఉంటుందని ఊదరగొట్టి ఇప్పుడు మన రైల్వే ట్రాక్ మీద 120 కంటే ఎక్కువ వేగంతో పోలేకున్నాయి. కానీ, టికెట్ డబ్బులు మాత్రం చుక్కలు చూపిస్తు న్నాయి. ఇక 2014 నాటి గ్యాస్ సిలిండర్ (గృహ వినియోగ సిలిండర్) ధర రూ.415 ఉంటే గత ఏడాదికి (2023కు) అది రూ.1170 కి పెరిగింది. సామాన్యులు, మధ్య తరగతి వారికిది భరించలేని భారంగా మారింది. ఇది మోదీ పాలన మార్క్. ఏ ప్రభుత్వమైనా ధరలు అదుపులో ఉంచి దిగువ, మధ్య తరగతుల జీవన గతులు మెరుగుపడాలని చూస్తాయి. కానీ, మోదీకి ధరలపై నియంత్రణ లేదు. అయితే



పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెరిగిన నేపథ్యంలో గత ఏడాది అయిదు రాష్ట్రాల ఎన్నికల ముందు పెట్రోల్‌పై రూ.10, డీజిల్‌పై రూ.5 తగ్గించటమే గాక వంట సిలిండర్ మీద రూ.200 తగ్గించారు. అంతేగాక సంవత్సరానికి 3-5 సిలిండర్లు ఉచితంగా ఇస్తామని ఎన్నికల్లో ప్రకటించారు. ఇలాంటి గిమ్మిక్కులు కన్నా ఏకంగా వంట సిలిండర్ ధర రూ.600-700 మధ్య ఉంచితే సామాన్యులకు, మధ్య తరగతికి మేలుచేసే ఆర్థిక విధానం అయ్యేది కదా! ధరలపై మోదీకి నియంత్రణ ఆలోచనే ఉన్నట్టు కనిపించదు. బియ్యం నుంచి పప్పులు, నూనెలు అన్నీ ఆకాశాన్ని అంటు తున్నాయి. వీటి భారం భరించలేక మధ్య తరగతి ప్రజలు నలిగిపోతున్నారు. అయినా మోదీకి ఇవేమీ కనిపించవు. ఇక తగిన మద్దతు ధర లేక రైతులు తమ ఉత్పత్తులను ఎలా విపణివీధిలో అమ్మాలో తెలియక గిజగిజలాడి పోతున్నారు. అయినా మోదీ వీటిని సమస్యలుగా పట్టించుకోడు. ధరల స్థిరీకరణ, మద్దతు ధర, మార్కెటింగ్ సౌకర్యం వంటివి విశ్వవ్యాపితంగా అభివృద్ధి చెందిన దేశాలన్నింటిలోనూ ఉన్నాయి. మరి భారతదేశం ఏ విషయంలో 'విశ్వగురు' అవబోతుందో ఎవరికీ అర్థం కాదు. భారత దేశంలో మూడవ అతిపెద్ద స్టార్టప్ ఎకోసిస్టం ఉందని తరుచూ ఊదర కొడుతుంటాడు. భారతీయ ఆర్థిక వ్యవస్థలో ఈ స్టార్టప్‌ల ఆర్థిక పరిమాణం ఎంత, అవి ఎంత ఆర్థిక ప్రగతి సాధించాయి, వాటివల్ల సామాన్యుడికి, మధ్య తరగతి వారికి ఒనగూడిన ప్రయోజనాలు ఏమీ చెప్పడు. పోనీ వాటి సమాచారం ఏ ప్రభుత్వ శాఖల వెబ్‌సైట్లలో అందుబాటులో ఉండదు. ఇప్పుడు మళ్లీ ఎన్నికలు రాబోతున్నాయి. ఆ విషయం జ్ఞప్తిలో ఉంచుకొనే తెలివిగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వంటగ్యాస్ సిలిండర్‌పై మరో వంద రూపాయలు తగ్గించాడు. ఇదే మోదీకి తెలిసిన ఆర్థిక శాస్త్ర సూత్రం. రేపు ఎన్నికలై మోదీనే మూడవసారి ప్రధాని అయితే ఒక్కసారి ఈ తగ్గింపులన్నీ మాయమైపోయినా ఆశ్చర్య పడనక్కరలేదు. అంతేగాదు, ఎన్నికల అనంతరం వంట గ్యాస్ సిలిండర్ ధర అమాంతం రూ. 1400-1500 లో అయినా ఆశ్చర్య పోనక్కరలేదు. లాక్‌డౌన్ అప్పుడు హఠాత్తుగా రైళ్లు నిలిపివేసి వలస కూలీలను వందల మైళ్లు నిర్దాక్షిణ్యంగా నడిపిన ఘనత మోదీది. వేయి రూపాయలు జన్‌ధన్ ఖాతాలలో వేసి బీద ప్రజలను అమాంతంగా ఉద్ధరించినట్లు చెప్పుకునే సాహసి కూడా. మోదీ ఈ పదేళ్లలో ఆర్థికంగా దేశ ప్రజలను ఎంత అధోగతికి తీసుకెళ్లాడో అదే రేపు ఎన్నికల్లో ఉత్తరాదిన కొలబద్ద అవుతుంది. ఈ విషయాలపై ప్రముఖంగా ఇండియా కూటమి తన ప్రచారం కేంద్రీకరించ కలిగితే, మోదీ మూడవసారి ప్రధాని కాకపోవచ్చు. అందుకే దక్షిణాదిన అప్పణంగా కొన్ని సీట్లు సంపాదించాలని ప్రయత్నాలు మొదలు పెట్టాడు మోదీ.

ఫ్రీలాన్స్ జర్నలిస్ట్

దేశం దుష్ట 'శక్తుల'తోనే పోరాడాలి

డాక్టర్ దేవరాజు మహారాజు

"నరేంద్ర మోదీకి దమ్ముంటే మణిపూర్ వెళ్లి అక్కడి ప్రజలకు ప్రాణప్రతిష్ట చేయాలి. అయోధ్యరాముడి ప్రాణప్రతిష్టకు హాజరుకాని శంకరాచార్యులపై ఈడీతో రైడ్ చేయించాలి. అసలు మోదీ ఈ దేశ ప్రధాన మంత్రా లేక దేశంలోని దేవాలయాన్నింటికీ ఆయనే ప్రధాన అర్చకుడా? పదేళ్లలో ఒక్కటంటే ఒక్క ప్రెస్‌మీట్ కూడా పెట్టని ఆయన, ప్రాప్టర్స్ లేకుండా మాట్లాడలేని ఆయన, తనకు యాభై ఆరు అంగుళాల ఛాతి ఉందని చెప్పుకోవడానికి సిగ్గుపడాలి కదా? ఈ దేశంలోని దైవ విశ్వాసకులంతా గాంధీ నమ్మిన రాముణ్ణి నమ్ముతున్నారు. మోదీ, షా, యోగి బీజేపీ, ఆర్ఎస్ఎస్ మాత్రం నాథూరామ్‌ను నమ్ముతున్నారు." అని పార్లమెంట్‌లో ప్రకటించాడు. జాన్ బ్రిటస్, కేరళ నుంచి రాజ్యసభకు ఎన్నికయ్యారు. అంతేకాదు, ఈ దేశద్రోహుల్ని నమ్మగూడదని ఆయన ఈ దేశ ప్రజలకు ఒక హెచ్చరిక కూడా చేశాడు. ఎన్నికల బాండ్స్ విషయంలో ఏం తేలిందీ? చందా ఇవ్వు దందా చేస్కో" అని మోదీ ప్రభుత్వం లెక్కలేని అవినీతికి పాల్పడిందని వెల్లడైంది కదా? స్వతంత్ర భారతావనిలో ఎన్నడూ ఎరగని విధంగా ఎన్నికల కమిషన్ అధికారులని కొనేసి చంఢీగడ్ మేయర్ పదవికి గేటుకడదామనుకున్న దుష్ట ప్రణాళిక ఎవరిదీ? మోదీ అండ్ పార్టీదే కదా? పైగా కనీవినీ ఎరగని రామభక్తి పారవశ్యంలో కళ్లుమూసుకుపోయినట్టు నటించారు కదా? ఏం నటన అదీ? ఆస్కార్ కూడా తల దించుకునేంత అసహ్యకరమైన కుటిల నటన! మెజార్టీ ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ కార్పొరేట్లనుకొని, ఎన్నికల అధికారులను కొని, బీజేపీకి వ్యతిరేకంగా పడిన బ్యాలట్ పేపర్లపై గీతలు గీయించి, చెల్లవిగా చేయించి, ఎలాగైనా మేయర్ పదవి దక్కించుకోవాలని ప్రయత్నించి, సుప్రీంకోర్టు ప్రధానన్యాయమూర్తి ముందు అడ్డంగా దొరికిపోయిన మోదీ సత్య నిష్టాగరిష్ఠుడా? ఇలాంటి వాడు గనకనే పీఠాధిపతులంతా ఆయోధ్య రాముడికి ఈయన ప్రాణప్రతిష్ట చెయ్యొద్దని గగ్గోలు పెట్టారు. ఈ రోజు ఏమైందీ; రామభక్తులంతా తలదించుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. రామభక్తులు, మోదీ భక్తులు నిజాలు గ్రహించాల్సిన అవసరం వచ్చింది. మోదీ ఒక దేవుడి అవతారంగా భావించే అంధ విశ్వాసకుల కళ్లు ఇకనైనా తెరుచుకోవాలి. ఎందుకంటే, ఎలక్టోరల్ బాండ్లపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రధాని మోదీకి ఊపిరి ఆడనివ్వడం లేదు. అందుకే శ్రీకృష్ణ కుచేలుల కథ ముందుకు తెచ్చి, "అదే ఈ కాలంలోనైతే కుచేలుడు శ్రీకృష్ణుడు ఇద్దరూ అవినీతి పరులయ్యేవారు" అని తన అక్కసు వెళ్ల గక్కుకున్నాడు. నిజానికి తన అవినీతి, తన పార్టీ అవినీతి బైటపడిందని ఆయన తన ఉక్రోషం వెళ్లగక్కుకున్నాడని ఈ దేశ ప్రజలకు అర్థమైంది. నేలను దున్ని ఈ దేశానికి అన్నం పెడుతున్న రైతులు ప్రధాని మోదీ ఇంటికీ, ఆఫీసుకీ కూతవేటు దూరంలో ఢిల్లీ సరిహద్దుల్లో ధర్నాచేస్తుంటే పోయి, మాట్లాడి సమస్య పరిష్కరించడానికి తీరిక లేదు. చిత్తశుద్ధిలేదు. వారిమీద డ్రోన్‌లు ఉపయోగించి, బాష్పవాయువు ప్రయోగించమంటాడు. వారిపై బుల్లెట్ల

వర్షం కురిపించమంటాడు. రోడ్డు మీద మేకులు కొట్టిస్తాడు. అవన్నీ దాటుకుని వస్తారేమోనన్న భయంతో రోడ్లు కోయించి, గోతులు తవ్విస్తాడు. ఇన్ని చేసినవాడు పారిపోయి సముద్రంలో దాక్కుంటాడు. అదేమంటే ద్వారక భూమికి పూజ చేస్తున్నానని ఫొటోషూట్ చేయించు కుంటాడు. అసలు ఫొటోషూట్ ఎప్పుడు చేయించుకోలేదూ? ఎక్కడ చేయించుకోలేదూ? బతుకే విచిత్ర వేషధారణ అయినట్లు ఫొటో షూట్ చేయించుకునే వ్యక్తికి ఇక పరిపాలనకు తీరిక ఎక్కడా? తన తల్లి దగ్గరికి వెళ్లినా యాభైమంది కెమెరామెన్‌లతో వెళ్లిన గొప్ప పుత్రరత్నం ప్రపంచమంతా వెతికినా మరొకరు దొరకరు కదా? ఇప్పటికైనా ఈ దేశ ప్రజలు నిజాలు గ్రహించి ఈ అబద్ధపు రాజును ఓ మూల కూర్చోబెడితే గాని ఈ దేశం బాగుపడదు. సముద్రంలో రెడ్‌కార్పెట్ మీద కూర్చుని ఫోజులిచ్చాడంటే ఈ దేశ ప్రజలు ఏమని ఆలోచించాలి? ఆయన్ని శాశ్వతంగా అందులోనే కలిపేయాలని నిర్ణయించుకోవాలి కదా? అతడి ఉత్తుత్తి యాక్షన్లను జనం నిజంచేసి చూపించాలి కదా? కన్నతల్లిని, కట్టుకున్న భార్యను దూరంపెట్టి ఈ దేశ ప్రజల సొమ్ముతో విదేశాల్లో బలాదూరు తిరిగేవాడు. ఈ దేశప్రజల బతుకులు ఉద్ధరిస్తారని ఎలా నమ్ముదాం? కట్టుకున్న భార్యకు విడాకులివ్వకుండా వదిలేసిన ఈ అనైతిక జీవి అబద్ధాల బ్రాండ్ ఎంబాసిడర్ "ఈ దేశ ప్రజలే నా కుటుంబం" అని అంటే ప్రజలు నమ్ముతారా? పదేళ్లుగా చూస్తున్నాం కదా? కోట్ల విలువగల సూట్లు వేసుకుని తిరగడం, కోట్లు విలువచేసే తిండి తినడం కోట్లు ఖర్చు చేసి దేశదేశాలు తిరిగిరావడం- సరేకాని దేశానికి ఆవగింజంత మేలు జరిగిందా? లేదు కదా? ఎంత ఖరీదైన దుస్తులు వేసుకున్నా, ఎంత మేకప్ చేసుకున్నా దేశాన్ని మరింత పేదరికంలోకి నెట్టిన ప్రేతకళ ఆయన ముఖంలోనూ ఆయన టీం సభ్యుల ముఖాల్లోనూ తాండవమాడుతూనే ఉంది కదా? "ప్రతి తల్లీ, ప్రతికూతురూ నాకు శక్తి స్వరూపిణియే. నాకు తల్లులూ, చెల్లెళ్లూ అందరూ శక్తి స్వరూపిణులే. నేను భారతమాత పూజారిని" అని గొంతు చించుకుని చెప్పుకున్న భారత ప్రధాని నరేంద్ర మోదీ. మరి ఈ కింది సమస్యలు ఎదురైనప్పుడు ఎందుకు నోరు కుట్టేసుకున్నారు? ఏ శక్తి ఆయనని ఆపిందీ?

1. ఢిల్లీలో ఆయన ఇంటి ముందే మహిళా రెజిలర్లు (పహిల్వాన్‌లు) లైంగిక దాడులకు గురైనప్పుడు ఏమైంది? వారు శక్తి స్వరూపిణులు కారా? ప్రపంచమీడియా ఈ దేశ ప్రభుత్వ విధానాన్ని తీవ్రంగా కడిగేసింది కదా?

2. కథువా, ఉన్నావ్, మద్రాసులలో శారీరక దోపిళ్లకుగురైన మహిళలంతా శక్తి స్వరూపిణులు కారా? వారు తల్లులూ, అక్కాచెల్లెళ్లూ, కూతుర్లు కారా?

3. కాన్పూర్‌లో ఇద్దరు మైనర్ బాలికలు ఉరేసుకుంటే-ఈ శక్తి పూజారికి ఈ భరతమాత పూజారికి ఒక్క చీమైనా కుట్టలేదా? అవసరమైనప్పుడు చెవిటివాడిగా, తప్పుని సరైనప్పుడు గుడ్డివాడుగా ఉండడం ఆయన నటనాకౌశల పాండిత్య ప్రదర్శనలో భాగమేనా?

4. మణిపూర్‌లో మహిళలు రేప్‌కు గురై, నగ్నంగా ఊరేగించినప్పుడు అయనలోని పూజారి ఏమయ్యాడు? భరతమాతనే నగ్నంగా ఊరేగించినట్టుగా ఉందని అవమానభారంతో దేశ ప్రజలు అట్టుడికి పోయారే-అప్పుడు కూడా ప్రపంచ మీడియా కన్నెర్రచేసిందే? మరి అప్పుడు ఈయనకేమైందీ? ఈయన పూజారి తనానికేమైంది? ఈయన అంటున్న ఆ శక్తిని వెనక ఉండి అంత హీనంగా చేయించింది ఈయనే కదా? కనీసం నోరు విప్పలేదు. క్షమాపణ కోరలేదు వెళ్లి కనీసం ఈ నాటికీ సానుభూతి చూపలేదు కదా? నోరు ఎవరు కుట్టేశారూ? అనవసరమైన వాటి మీద గొంతు చించుకునే ఈ నాటకీయ రాయుడు స్పందించలేదెందుకూ? ఇలాంటి ఎన్నెన్నో సందర్భా లలో భారత ప్రధాని నోరు ఎందుకు మెదపలేదో, ఎందుకు కాలు కదిపి అక్కడికి వెళ్లలేక పోయాడో 'నేషన్ వాంట్స్ టు నో' అండీ! తమాషానా? ఊరికే మాటలు చెప్పడం కాదు. "ఆధ్యాత్మికత అనేది మనిషిని అజ్ఞానిగా, ఆలోచనా హీనుడిగా, పరాధీనుడిగా, బానిసగా, ప్రశ్నించలేని వాడిగా నిష్క్రియా శీలుడిగా తయారు చేసే ఒక ప్రక్రియ!" అన్నది ఈ దేశంలోని యువతీ యువకులు గ్రహిస్తున్నారు. ఇప్పుడు ఇక రామాలయాలు, పూజారివేషాలూ పనిచేయవు. రాముణ్ణి నమ్మే జనం ఉన్నా, నాథూరామ్‌ను నమ్మే ప్రజలు లేరు. ఆ పని బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు చేసుకోవాల్సిందే! ఒక ఏనుగూ, మురికి గుంటలోంచి లేచి వచ్చిన పందీ-రెండూ ఒక చిన్న వంతెన మీద ఎదురుపడ్డాయి. ఏనుగు పక్కకు తొలగి పందికి దారి ఇచ్చింది. అంతే తనకు ఏనుగు భయపడుతోందని పంది ప్రచారం మొదలు పెట్టింది. తన విలువ, తన స్థాయి ఏమిటో తెలుసు కోకుండా దుష్ప్రచారానికి దిగింది. వరాహావతారం! సమాజంలో కొందరు మనుషులు, కొన్ని రాజకీయ పార్టీలు కూడా అంతే!! వారి స్థాయి ఏమిటో వారు గ్రహించుకోరు. ఎదుటివారి సామర్థ్యాన్ని కూడా అంచనా వేయలేరు. ఇది ఈ దేశ కాల పరిస్థితులకు కూడా అన్వయించు కోవచ్చు. సహనం, సంయ మనం పాటిస్తున్న ఈ దేశ ప్రజలు ఏనుగులాంటి వారే. వారి మంచితనాన్ని ఆసరా చేసుకుని ఎగిరెగిరిపడే వరాహమూర్తులే మన ప్రస్తుత బీజేపీ నాయ కులు. ప్రజా ఏనుగు ఇప్పుడు బురద కడుక్కుందామని అనుకుంటోంది. అందుకే తొక్కెయ్యడానికి సిద్ధంగా ఉంది! ఒక వ్యక్తి ఏదో తప్పు చేశాడన్న అనుమానంతో ఆ దేశపు రాజు అతనికి జైలుశిక్ష విధించాడు. అలా నెలలు, సంవత్సరాలు ఆ వ్యక్తి జైల్లో బందీగా ఉన్నాడు. జైల్లో విసిగిపోయి. ఆహారం అందించే భటుడి సహాయతో ఎలాగైనా బయటపడా లనుకున్నాడు. జైల్లోని వక్తి! బయటపడే మార్గం ఆలోచించుకునే క్రమంలో తలుపుతోశాడు. అంతే- అది తీసే ఉంది. తెరుచుకుంది. అయితే, బైట అంతా చీకటిగా ఉంది. అందు లోంచి ధైర్యంగా నడిచి వెళుతూ ఉంటే ఎవరు అడ్డుపడలేదు. అలా నడిచి, నడిచి వెలుగులోకి వెళ్లాడు. అప్పుడు అసలు విషయం గ్రహించాడు. అమాయ కత్వం, మంచితనం, అరాధనా భావన- వ్యాకులత వంటి వాటి మధ్య తను ఈ పదేళ్లూ బందీగా ఉండి పోయానా? అని అనుకున్నాడు. అసలు విషయం గ్రహించాడు. ఇప్పుడు మేల్కొని, పునరుద్ధరించుకుని బైటపడాలి! చుట్టుముట్టి ఉక్కిరిబిక్కిరిచేస్తున్న దేశ కాల పరిస్థితుల్ని అదుపులోకి తెచ్చు కోవాలి. అబద్ధాల్ని నిజాలతోను, అనైతికతను నైతికతతోనూ, అజ్ఞానాన్ని జ్ఞానంతోనూ, మోసాల్ని వివేకంతోనూ ఛేదిస్తూ 'మానవ్ మానవ్ ఏక్ సమాన్' నినాదంతో ముందుకు కదలాలి. ఊరికే నిశ్చేష్టులై చూస్తున్నంతకాలం మార్పు రాదు! కదలాలి!! తోటివారిని కది లించాలి!! పునర్నిర్మాణ కార్యక్రమం సత్వరం ప్రారంభించాలి. రాముడు ఒక కల్పిత పాత్ర అనీ, నాథూరామ్ ఒక దేశద్రోహి అని చెప్పకుండా, అబద్ధాలతో అధికారంలో కొనసాగుదామని అనుకునేవారికి బుద్ధిచెప్పాలి. అందుకే ఆస్కార్ వైల్డ్ అన్నాడు "ప్రతి అబద్ధం విషంలాంటిది. హాని చేయని అబద్ధాలు ఉండవు. కేవలం యదార్థమే సురక్షితం, క్షేమకరం. అది ఏరకం గానూ పగుల గొట్టలేని రత్నం లాంటిది!" అని!

కేంద్ర సాహిత్య అకాడమీ విజేత, జీవశాస్త్రవేత్త

ఉత్తర భారతంలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

న్యూఢిల్లీ: దేశ రాజధాని సహా ఉత్తర భారతంలో ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరుగుతున్నాయి. గత 4 సీజన్ల కంటే 4 శాతం అధికంగా ఉష్ణోగ్రతలు నమోదైనట్లు భారత వాతావరణ శాఖ వెల్లడించింది. ఈ సీజన్‌లో శనివారం ఉదయం 21 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. 37 నుంచి 40 డిగ్రీల వరకు అత్యధిక ఉష్ణోగ్రత నమోదయ్యే అవకాశం ఉంది. ఉదయం 8:30 గంటలకు గాలిలో తేమ 64 శాతం వరకు నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. తెలంగాణ వ్యాప్తంగా ఎండలు దంచికొడుతున్నాయి. సాధారణం కంటే అధికంగా ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో 40 డిగ్రీల దాకా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో జనాలు బయటకు వెళ్లాలంటేనే భయపడిపోతున్నారు. ఉక్కపోత కూడా అధికమవడంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉదయం, సాయంత్రం సమయాల్లోనే ఇంట్లో నుంచి బయటకు వెళ్లాలని వాతావరణ శాఖ అధికారులు సూచిస్తున్నారు.

సిలిండర్ పేలి తల్లి, ముగ్గురు చిన్నారుల మృతి

లక్నో: ఉత్తరప్రదేశ్‌లోని డోరియా జిల్లాలో తీవ్ర విషాదం చోటుచేసుకున్నది. శనివారం ఉదయం జిల్లాలోని దుమ్రిలో ఉన్న ఓ ఇంట్లో సిలిండర్ పేలడంతో నలుగురు మృతిచెందారు. దుమ్రిలో ఓ గృహిని చాయ్ పెడుతుండగా... గ్యాస్ లీకై సిలిండర్ ఒక్కసారిగా పేలింది. దీంతో మంటలు అంటుకుని గృహిణి సహా ఆమె ముగ్గురు పిల్లలు అక్కడికక్కడే మరణించారు. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈ ఘటనలో తల్లి సహా ముగ్గురు పిల్లలు చనిపోయారని డోరియా ఎస్పీ సంకల్ప్ శర్మ చెప్పారు. ప్రమాదంపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

44 మందితో సీపీఎం అభ్యర్థుల జాబితా

న్యూఢిల్లీ: రానున్న లోక్‌సభ ఎన్నికలకు సీపీఎం తమ అభ్యర్థుల జాబితాను విడుదల చేసింది. దేశవ్యాప్తంగా మొత్తం 44 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. చాలా రాష్ట్రాల్లో ఒకటీ రెండు స్థానాలకే అభ్యర్థులను ప్రకటించిన సీపీఎం... కేరళ, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో ఎక్కువ సీట్లకు తమ అభ్యర్థులను వెల్లడించింది. ఈ జాబితాలో అత్యధికంగా పశ్చిమ బెంగాల్‌లో 17 స్థానాలు ఉన్నాయి. కేరళకు చెందిన 15 మంది అభ్యర్థులు జాబితాలో ఉన్నారు. ఇందులో అలప్పుజ నుంచి సిట్టింగ్ ఎంపీ ఆరిఫ్, వడకర నుంచి మాజీ ఆరోగ్య మంత్రి కేకే శైలజ టీచర్, కోజీకోడ్ నుంచి రాజ్యసభ ఎంపీ ఎలమరం కరీం ఉన్నారు. పశ్చిమ బెంగాల్‌లోని 17 పేర్లలో ముర్షిదాబాద్‌కు చెందిన మహ్మద్ సలీం పేరు కూడా ఉంది. ఈ జాబితాలో తమిళనాడుకు చెందిన ఇద్దరు అభ్యర్థులు ఉన్నారు. మధురై నుంచి సిట్టింగ్ ఎంపీలు ఎస్.వెంకటేశన్, దిండిగల్ నుంచి ఆర్.సచ్చిదానందంలకు టికెట్లు ఇచ్చింది. ఇక తెలుగు రాష్ట్రాల విషయానికి వస్తే తెలంగాణలోని భువనగిరి స్థానానికి ఎండీ జహంగీర్ పేరును, ఆంధ్రప్రదేశ్‌లోని అరకు స్థానానికి పాచిపెంట అప్పలనరస పేరును జాబితాలో వెల్లడించింది.

కూలిన నిర్మాణంలో ఉన్న వంతెన

లక్నో: నిర్మాణంలో ఉన్న వంతెనలో కొంత భాగం కూలిపోయింది. వంతెనపై నిర్మిస్తున్న రెండు బీములు కూలిపోయాయి. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరుగలేదు. ఉత్తరప్రదేశ్‌లోని బులంద్‌షహర్ జిల్లాలో ఈ ఘటన జరిగింది. గజ్రౌలా గ్రామం నుంచి అమ్రోహాలోని విరంపూర్ గ్రామం వరకు రూ.83 కోట్ల వ్యయంతో గంగానదిపై బ్రిడ్జి నిర్మిస్తున్నారు. ప్రజాపనుల విభాగం (పీడబ్ల్యూడీ), సేతు నిగమ్ పర్యవేక్షణలో వంతెన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. శుక్రవారం అర్ధరాత్రి వేళ వంతెనకు చెందిన రెండు బీములు కూలిపోయాయి. అయితే భారీ గాలితో కూడిన వర్షం వల్ల ఈ ఘటన జరిగినట్లు అధికారులు తెలిపారు. ఈ ప్రమాదంలో ఎవరూ గాయపడలేదని, ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని చెప్పారు. మరోవైపు నాణ్యత లేని నిర్మాణ సామగ్రిని వినియోగించడం వల్ల ఈ వంతెనకు చెందిన రెండు బీములు కూలినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారులు వీటిని ఖండించారు.

బీజేడీకి షాక్...సిట్టింగ్ ఎంపీ రాజీనామా

భువనేశ్వర్: ఒడిశాలో అధికార బీజేడీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. సిట్టింగ్ ఎంపీ, సీనియర్ నేత అనుభవ్ మొహంతి బీజేడీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఈ మేరకు తన రాజీనామా లేఖను ఒడిశా ముఖ్యమంత్రి, బీజేడీ అధ్యక్షుడు నవీన్ పట్నాయక్‌కు పంపించారు. ఇన్నేళ్లుగా తనకు ప్రజాసేవ చేసుకునే అవకాశం కల్పించినందుకు నవీన్ పట్నాయక్‌కు, బీజేడీకి మొహంతి కృతజ్ఞతలు తెలిపారు. వ్యక్తిగత కారణాలతోనే పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు లేఖలో పేర్కొన్నారు. తనకు అత్యంత సన్నిహితంగా ఉండే వ్యక్తులు ఇటీవల మరణించడంతో సరిగా పనిచేయలేకపోతున్నానని తెలిపారు. అందుకే రాజీనామా నిర్ణయం తీసుకున్నానని వివరించారు. రాజకీయాలకు దూరంగా ఉంటానని పేర్కొన్నారు. రాజకీయాలకు దూరంగా ఉన్నా, తన నియోజకవర్గ ప్రజలకు ఎప్పటికీ సేవ చేసుకుంటానని తెలిపారు. అనుభవ్ మొహంతి కేంద్రపర నియోజకవర్గం నుంచి లోక్‌సభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

రూ.205 లక్షల కోట్లకు పెరిగిన అప్పు: ప్రియాంక

న్యూఢిల్లీ: బీజేపీ నేతృత్వంలోని కేంద్ర సర్కారు రూ.14 లక్షల కోట్ల రుణం తీసుకునేందుకు ప్రయత్నాలు చేస్తోందని కాంగ్రెస్ నేత ప్రియాంకా గాంధీ వాద్రా ఆరోపించారు. ఈ ప్రతిపాదనను ఆమె తప్పుపట్టారు. దేశ ప్రజలను ఎందుకు అప్పుల ఊబిలోకి నెట్టివేస్తున్నారని ఆమె ప్రశ్నించారు. మోదీ హయాంలో నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, ఆర్థిక సంక్షోభం పెరుగుతున్నట్లు ఆమె చెప్పారు. ఆర్థిక లోటు పూడ్చేందుకు సెక్యూరిటీలను జారీ చేసి రాబోయే ఆర్థిక సంవత్సరానికి సుమారు రూ.14.13 లక్షల కోట్ల రుణం తీసుకోనున్నట్లు ఇటీవల బడ్జెట్ ప్రసంగంలో మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. ఆ విషయాన్ని ప్రియాంకా గాంధీ తన ఎక్స్ ఖాతాలో ప్రశ్నించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రూ.14 లక్షల కోట్లు అప్పు తీసుకోవాలని ఆర్థిక శాఖ ప్రతిపాదించిందని, ఎందుకోసం ఆ డబ్బు అని ప్రియాంక ప్రశ్నించారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి 2014 వరకు దేశం చేసిన అప్పు రూ.55 లక్షల కోట్లు మాత్రమేనని, కానీ గడిచిన పదేళ్లలో మోదీ సర్కారు ఆ రుణాన్ని రూ.205 లక్షల కోట్లకు చేర్చిందని ప్రియాంక ఆరోపించారు. అంటే మోదీ సర్కారు గత పదేళ్లలో సుమారు రూ.150 లక్షల కోట్ల అప్పు చేసినట్లు తెలిపారు. దేశంలోని ప్రతి పౌరుడిపై 1.5 లక్షల అప్పు ఉన్నట్లు ఆమె పేర్కొన్నారు.

బీఎస్పీ ఎమ్మెల్యే హత్య కేసులో ఆరుగురికి జీవితఖైదు

న్యూఢిల్లీ: బీఎస్పీ ఎమ్మెల్యే రాజు పాల్ హత్య కేసులో ప్రత్యేక సీబీఐ కోర్టు ఆరుగురికి జీవితఖైదు విధించింది. ఈ కేసులో ఏడుగురిని దోషులుగా ప్రకటించి...ఆరుగురికి జీవిత ఖైదు విధించింది. ప్రత్యేక సీబీఐ జడ్జి కవితా మిశ్రా ఈ మేరకు తీర్పు ఇచ్చారు. గత ఏడాది హత్యకు గురైన గ్యాంగ్‌స్టర్ అతిక్ అహ్మద్ కూడా ఈ కేసులో ప్రధాన నిందితుడు. రంజీత్ పాల్, అబిద్, ఫర్హన్ అహ్మద్, ఇస్రార్ అహ్మద్, జావెద్, గుల్‌హసన్, అబ్దుల్ కావి ఈ కేసులో నిందితులు. ఆరుగురికి జీవిత కాల శిక్షతో పాటు రూ.11.65 లక్షల జరిమానా విధించారు. ప్రయాగ్‌రాజ్ ఎమ్మెల్యే రాజు పాల్‌తో పాటు అతని అనుచరులు దేవిదిన్ పాల్, సందీప్ యాదవ్‌లను 2005 జనవరి 25వ తేదీన హత్య చేశారు. 2004 ఉపఎన్నికల్లో అతిక్ అహ్మద్ సోదరుడు అష్రఫ్‌ను ప్రయాగ్‌రాజ్ వెస్ట్ సీటులో రాజు పాల్ ఓడించారు. ఆ కక్షతో బీఎస్పీ ఎమ్మెల్యేపై అప్పట్లో దాడి జరిగింది. అష్రఫ్ అహ్మద్‌కు చెందిన 9 మంది ముఠా పాల్ వాహనాన్ని అడ్డుకుని తుపాకులతో కాల్చి చంపింది.

భారత్‌కు ఎవరి పాఠాలు అవసరం లేదు: ధన్కర్



న్యూఢిల్లీ: భారత్‌లో చట్టబద్ధమైన పాలన కొనసాగుతోందని, దీన్ని ఎవరూ ప్రశ్నించాల్సిన అవసరం లేదని ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కర్ అన్నారు. మన దేశానికి ఎవరూ పాఠాలు నేర్పాల్సిన అవసరం లేదని ధన్కర్ చెప్పుకొచ్చారు. దిల్లీ మద్యం కేసులో సీఎం అరవింద్ కేజ్రీవాల్‌ను ఈడీ అరెస్ట్ చేయడంపై జర్మనీ, అమెరికా, ఐక్యరాజ్యసమితి ఇటీవల స్పందించాయి. కాంగ్రెస్ పార్టీ బ్యాంకు ఖాతాలు స్తంభింపచేయడంపైనా అమెరికా, ఐరాస ప్రతినిధులు ప్రశ్నించారు. దీనిపై ధన్కర్ స్పందిస్తూ భారత్ ప్రజాస్వామ్య దేశమని, భారత్ పటిష్టమైన న్యాయ వ్యవస్థ కలిగి ఉందన్నారు. ఈ విషయంలో ఏ వ్యక్తి లేదా ఏ సమూహం కోసం రాజీపడటం ఉండదన్నారు. తమ దేశ చట్టబద్ధమైన పాలనపై ఎవరి నుంచీ పాఠాలు నేర్చుకోవాల్సిన అవసరం లేదన్నారు. చట్టం ముందు ఎవరైనా ఒక్కటేనని, అవినీతి చేస్తే జైలుకు వెళ్లడం తప్పదన్నారు. ఎన్నికల సందర్భంగానే ఇదంతా జరిగిందంటున్నారని, దోషులను శిక్షించడానికి ప్రత్యేకంగా సీజన్ ఏమైనా ఉంటుందా అని ప్రశ్నించారు.

రోడ్డు పక్కన టీ తాగిన సీఎం స్టాలిన్

సేలం: డీఎంకే అధినేత, తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ లోక్‌సభ ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశారు. శనివారం ఉదయం సేలంలో పార్టీ అభ్యర్థి తరఫున ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులను, దుకాణదారులను ఓట్లడిగారు. పార్లమెంటు ఎన్నికల్లో డీఎంకే అభ్యర్థి టీఎం సెల్వగణపతిని భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు. ఈ సందర్భంగా ఆయన రోడ్డు వెంబడి ఉన్న ఓ చాయ్ దుకాణంలోకి వెళ్లారు. అక్కడ చాయ్ పెట్టించుకుని తాగారు. దీనికి సంబంధించిన వీడియోలు వైరల్ అయ్యాయి.

ఆ మూడు సీట్లపై పీటముడి

ముంబై: లోక్‌సభ ఎన్నికల వేళ మహారాష్ట్రలోని రాజకీయాలు మళ్లీ మలుపు తిరుగుతున్నాయి. ఇప్పటికే శివసేన, ఎన్సీపీలో ఏర్పడిన చీలికలు కొత్త ప్రభుత్వాల ఏర్పాటుకు దారితీయగా... తాజాగా కాంగ్రెస్, శివసేన (యూబీటీ), ఎన్సీపీ (శరద్‌పవార్) వర్గాలతో ఏర్పడిన మహావికాస్ అఘాడీ కూటమిలోనూ అంతర్గత పోరు తీవ్రమవుతోంది. ఒప్పందానికి విరుద్ధంగా కీలకమైన మూడు స్థానాల్లో శివసేన (యూబీటీ) అభ్యర్థులను ప్రకటించడం వివాదాలకు దారితీసింది. ఈ సమస్యను పరిష్కరించేందుకు శరద్‌పవార్ రంగంలోకి దిగినా ప్రయోజనం కనిపించడం లేదు. లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి శివసేన(యూబీటీ) 17 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. ఇందులో సంగలీ, ముంబై సౌత్ సెంట్రల్ నియోజకవర్గాలున్నాయి. భివాండీ స్థానంలో ఎన్సీపీ (శరద్‌పవార్) వర్గం బరిలోకి దిగాలని యోచిస్తోంది. అయితే, ఈ మూడు స్థానాలను తన వద్దే ఉంచుకోవాలని హస్తం పార్టీ భావిస్తోంది. దీనికి ఓ పరిష్కారం కనుగొనేందుకు శరద్‌పవార్ నేతృత్వంలో మూడు పార్టీల ముఖ్య నేతలు సమావేశమయ్యారు. మాజీ ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రే, కాంగ్రెస్ నుంచి పృథ్వీరాజ్ చవాన్, బాలాసాహెబ్ థోరట్ తదితరులు హాజరయ్యారు. ప్రత్యేకంగా ఈ మూడు స్థానాలపైనే చర్చ జరిగింది. వాటిని వదులుకునేందుకు కాంగ్రెస్ ససేమిరా అనడంతో తదుపరి సమావేశం సోమవారానికి వాయిదా పడింది. మహారాష్ట్రలో మొత్తం 48 లోక్‌సభ స్థానాలున్నాయి. వీటిలో 44 స్థానాలకు మహావికాస్ అఘాడీ కూటమి పార్టీల మధ్య సర్దుబాటు జరిగింది. ఇందులో భాగంగా శివసేన (యూబీటీ) 19, కాంగ్రెస్ 16, శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ పార్టీకి 9 సీట్లు కేటాయించారు. మిగతా నాలుగు స్థానాలకు చర్చలు జరుగుతున్నాయి. అవే సంగలీ, ముంబై సౌత్ సెంట్రల్, భివాండీ, ముంబై వాయువ్య స్థానాలు. అయితే, తాము మొత్తం 22 స్థానాల్లో పోటీ చేస్తామని శివసేన (యూబీటీ) నేత సంజయ్‌రౌత్ ప్రకటించడం కూటమిలో అసంతృప్తికి కారణమవుతోంది.

వివాదాస్పదమవుతున్న స్థానాల్లో అభ్యర్థుల ఖరారు అంశాన్ని ఓ కొలిక్కి తీసుకొచ్చేందుకు శరద్‌పవార్ తీవ్రంగా కృషి చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానంతోనూ మాట్లాడినట్లు తెలుస్తోంది. వారి సూచన మేరకు శుక్రవారం రాత్రి కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌ఛార్జ్ రమేశ్ అధ్యక్షతన పార్టీ అంతర్గత సమావేశం జరిగింది. ఈ భేటీలోనూ ఎలాంటి పరిష్కారం

'అఘాడీ'లో అంతర్గత పోరు

లభించలేదు. మిత్రపార్టీల మధ్య స్నేహపూర్వక వాతావరణం ఉండాలని, లేదంటే ప్రత్యర్థులకు ఇది అవకాశంగా మారుతుందని శరద్‌పవార్ హితవు పలుకుతున్నారు. భివాండీ స్థానాన్ని ఆశిస్తున్న ఎన్సీపీ (శరద్‌పవార్)కి ప్రతికూలత ఎదురైతే సమస్య మరింత జఠిలమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ అంశంపై కాంగ్రెస్ సీనియర్ నేత నసీమ్ ఖాన్ మాట్లాడుతూ శివసేన (యూబీటీ) ఏకపక్షంగా అభ్యర్థులను ప్రకటించడం సరికాదని అన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ సంగలీ, ముంబై సౌత్ సెంట్రల్, భివాండీ స్థానాలను వదులుకోబోమని, ముంబై నార్త్, ముంబై వాయువ్య స్థానాల్లోనూ స్నేహపూర్వక పోరాటం ఉంటుందని చెప్పారు. మరోవైపు కాంగ్రెస్ తీరును శివసేన (యూబీటీ) నేత సంజయ్ రౌత్ తప్పుబట్టారు. ఇలాంటి పరిస్థితులు బీజేపీకి అనుకూలంగా మారతాయని చెప్పారు. కాంగ్రెస్ పరిణితి చెందిన పార్టీ అనీ, ఆలోచించి తగిన నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. కూటమిలో ఇలాంటి పొరపచ్చాలు సహజమేనని, బీహార్, ఉత్తరప్రదేశ్‌లోనూ శివసేన (యూబీటీ) స్నేహపూర్వక పోరు ఉంటుందన్నారు.

'బీజేపీకి కాలం దగ్గర పడింది'

రాజ్యాంగ పరిరక్షణకే లోకతంత్ర బచావో ర్యాలీ

ఒక వ్యక్తిని కాపాడుకోవడం కోసం కాదు : కాంగ్రెస్

న్యూఢిల్లీ: భారతీయ జనతా పార్టీ (బీజేపీ)కి కాలం దగ్గర పడిందని కాంగ్రెస్ నొక్కిచెప్పింది. ఇదే సందేశాన్ని లోక్‌తంత్ర బచావో ర్యాలీ ద్వారా లోక కల్యాణ్ మార్గ్ (ప్రధాని నివాసమున్న ప్రాంతం)కు చేరవేస్తామని ప్రకటించింది. దిల్లీలోని రామ్‌లీలా మైదానంలో ఆదివారం జరగబోయే ర్యాలీ... ఒక వ్యక్తిని కాపాడటం కోసం కాదని, ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని పరిరక్షించడం కోసమని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ చెప్పారు. ఆయన శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 'ఇది ఒక వ్యక్తి కోసం జరిగే ర్యాలీ కాదు కాబట్టే లోకతంత్ర బచావో ర్యాలీ అంటున్నాం. ఇది ఒక పార్టీకి సంబంధించినది కాదు... దీనితో 27-28 పార్టీలు ముడిపడి ఉన్నాయి. 'ఇండియా'తో బంధాన్ని ఏర్పాటు చేసుకున్న వారంతా హాజరవుతారు' అని అన్నారు. రాజ్యాంగాన్ని తిరగరాయాలని బీజేపీ చెబుతోందని, రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకే ఈ ర్యాలీ అని నొక్కిచెప్పారు. పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీతో పాటు అనేక మంది సీనియర్ నాయకులు ర్యాలీలో ప్రసంగిస్తారన్నారు. దిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ అరెస్టుకు నిరసనగా ర్యాలీ జరుగుతున్నట్లు ఆప్ వర్గాలు ప్రచారం చేస్తున్న క్రమంలో కాంగ్రెస్ సీనియర్ నేత వ్యాఖ్యలకు ప్రాధాన్యత ఏర్పడింది. ఈనెల 17న ముంబై నుంచి ఎన్నికల సమరశంఖాన్ని ఇండియా కూటమి పూరించిందని, ఈ ర్యాలీ రెండవ సమరశంఖం కాబోతోందని జైరాం రమేశ్ అన్నారు. కూటమి ఐక్యతనూ చాటుతుందన్నారు. అధిక ధరలు, 45 ఏళ్ల గరిష్టానికి నిరుద్యోగం, ఆర్థిక అసమానతలు, సామాజిక విభజన, రైతులకు జరుగుతున్న అన్యాయం, విపక్షాలే లక్ష్యంగా కేంద్ర దర్యాప్తు సంస్థల దుర్వినియోగంపై నేతలు మాట్లాడతారన్నారు. ప్రతిపక్ష పార్టీలను రాజకీయంగానే కాకుండా ఆర్థికంగానూ తొక్కేయాలన్న ప్రధాని దురుద్దేశం ఈ చర్యల్లో కనిపిస్తోందని వ్యాఖ్యానించారు. శుక్రవారం ఐటీ శాఖ నుంచి రెండు నోటీసులు వచ్చాయని చెప్పారు. కాగా, దిల్లీ ర్యాలీలో సీపీఐ, సీపీఎం ప్రధాన కార్యదర్శులు డి.రాజా, సీతారాం ఏచూరి, జార్ఖండ్ సీఎం చంపై సోరెన్, ఎన్సీపీ (ఎస్పీ) అధ్యక్షుడు శరద్ పవార్, ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్, ఎన్సీ నేత ఫరూక్ అబ్దుల్లా, పీడీపీ అధినేత్రి మెహబూబా ముఫ్తీ, ఎస్పీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్, డీఎంకే నేత తిరుచీ శివ, టీఎంసీ నాయకుడు డెరెక్ ఓ బ్రెయిన్ తదితరులు పాల్గొంటారు.

బీజేపీలోకి శివరాజ్ పాటిల్ కోడలు

ముంబై: మహారాష్ట్రలో కాంగ్రెస్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. కేంద్ర మాజీ మంత్రి శివరాజ్ పాటిల్ కోడలు అర్చనా పాటిల్ కాంగ్రెస్‌ను వీడి బీజేపీలో చేరారు. మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ సమక్షంలో ఆమె కాషాయ కండువా కప్పుకున్నారు. శివరాజ్ పాటిల్ కాంగ్రెస్ సీనియర్ నేత. ఆయన లాతూర్ లోక్‌సభ స్థానం నుంచి ఏడుసార్లు ఎన్నికయ్యారు. యూపీఏ-1 హయాంలో కేంద్ర హోంమంత్రిగా పనిచేశారు. 26/11 ముంబై ఉగ్రదాడుల నేపథ్యంలో ఆయన పదవి నుంచి తప్పుకున్నారు. అంతకుముందు లోక్‌సభ స్పీకర్‌గానూ వ్యవహరించారు. అర్చనా పాటిల్ తమ పార్టీలో చేరడాన్ని స్వాగతిస్తున్నామని, ఆమె రావడంతో లాతూర్‌తో పాటు మరాఠవాడ ప్రాంతంలో బీజేపీకి కలిసి వస్తుందని ఫడ్నవీస్ అన్నారు. 'రెండు దశాబ్దాలుగా సామాజిక సేవతో ముడిపడ్డ ఉన్నా... ఇక రాజకీయాల కోసం బీజేపీని ఎంచుకున్నా' అని కమలం పార్టీలో చేరిన సందర్భంగా అర్చన వెల్లడించారు. కాంగ్రెస్ సీనియర్ నేత, మహారాష్ట్ర మాజీ సీఎం అశోక్ చవాన్ కూడా గతనెలలో బీజేపీలోకి చేరిన విషయం తెలిసిందే.

ఆమెకు వంట మాత్రమే తెలుసు

కాంగ్రెస్ ఎమ్మెల్యే వివాదాస్పద వ్యాఖ్యలు

బెంగళూరు: బీజేపీ మహిళా అభ్యర్థిపై కర్నాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే షామనూరు శివశంకరప్ప చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై దుమారం రేగింది. దావణగెరె నుంచి బరిలో నిలిచిన బీజేపీ అభ్యర్థికి వంటగదిలో వంట చేయడం మాత్రమే తెలుసు అని ఆయన వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తన కోడలు ప్రభా మల్లికార్జున్ కోసం ఆయన ప్రచారం చేస్తున్న సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేశారు. దావణగెరె స్థానానికి బీజేపీ అభ్యర్థిగా ఎంపీ జీఎం సిద్దేశ్వర భార్య గాయత్రి సిద్దేశ్వరను బరిలోకి దింపింది. గాయత్రి సిద్దేశ్వరను ఉద్దేశించి ఎమ్మెల్యే శివశంకరప్ప మాట్లాడుతూ ఆమె ఎన్నికల్లో గెలిచి మోదీకి కమలం అందించాలనుకుంటోందని అందరికీ తెలుసని, ముందు దావణగెరె సమస్యలను అర్థం చేసుకోండి. ఈ ప్రాంతంలో మేము అభివృద్ధి పనులు చేశాం. మీకు మాట్లాడటం తెలియదు. కిచెన్‌లో వంట చేయడం మాత్రమే తెలుసు. ప్రతిపక్ష పార్టీకి బహిరంగంగా మాట్లాడే శక్తి లేదని అన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే వ్యాఖ్యలపై బీజేపీ ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసింది. శివశంకరప్ప తనపై చేసిన వ్యాఖ్యలపై గాయత్రి సిద్దేశ్వర స్పందిస్తూ ప్రస్తుతం మహిళలు అన్నింటా రాణిస్తున్నారని, కానీ మహిళలు వంటింట్లోనే ఉండాలి అనే రీతిలో ఆయన వ్యాఖ్యలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలు ఇంట్లోని మగవాళ్లకు, పిల్లలకు, పెద్దలకు అందరికీ ఎంత ప్రేమగా వంట చేస్తారో ఆయనకు తెలియదన్నారు. మహిళలు స్వతంత్రంగా ఎదగడానికి ప్రధాని మోదీ ప్రోత్సాహం అందిస్తున్నారని ఆమె పేర్కొన్నారు.

భారీ భద్రత మధ్య అన్సారీ అంత్యక్రియలు

లక్నో: కట్టుదిట్టమైన భద్రత మధ్య రాజకీయవేత్తగా మారిన గ్యాంగ్‌స్టర్ ముక్తార్ అన్సారీ అంత్యక్రియలు శనివారం పూర్తయ్యాయి. ఈ కార్యక్రమానికి ప్రజలు భారీ సంఖ్యలో హాజరయ్యారు. కానీ ఆయన భార్య, కుమారుడు మాత్రం అంత్యక్రియలకు హాజరు కాలేదు. గుండెపోటుతో మరణించిన అన్సారీ అంత్యక్రియలు ఉత్తరప్రదేశ్‌లోని ఘాజీపూర్‌లో జరిగాయి. కాలీబాగ్‌లోని శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. ఎలాంటి అల్లర్లు జరగకుండా పోలీసులు ప్రత్యేకమైన భద్రత ఏర్పాట్లు చేశారు. భారీగా తరలివచ్చిన ప్రజలు స్మశానవాటికలోకి ప్రవేశించేందుకు బారికేడ్లను బద్దలు కొట్టడం వల్ల గందరగోళం నెలకొంది. కాగా, యూపీలోని బాందా జైలులో శిక్ష అనుభవిస్తున్న 63 ఏళ్ల అన్సారీ గురువారం రాత్రి 8.25 గంటల సమయంలో ఒక్కసారిగా తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వాంతులు చేసుకొని అపస్మారక స్థితిలోకి వెళ్లారు. దీంతో జైలు అధికారులు ఆయనను దుర్గావతి మెడికల్ కళాశాల ఆసుపత్రికి తరలించారు. వెంటనే చికిత్స ప్రారంభించినప్పటికీ గుండెపోటుతో ఆయన చనిపోయినట్లు వైద్యులు తెలిపారు. పోస్ట్‌మార్టమ్ నిర్వహించి కుటుంబసభ్యులకు భౌతిక కాయాన్ని అందించారు. అన్సారీ మృతితో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా రాష్ట్రవ్యాప్తంగా 144వ సెక్షన్ విధించారు. ప్రజలు ఎక్కడా గుమికూడదని ప్రకటించారు. బందా, మౌ, ఘాజీపూర్, వారణాసి జిల్లాల్లో అదనపు బలగాలను మోహరించారు. అన్సారీ మృతిపై సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలను అరికట్టేందుకు పోలీసుల ఐటీ సెల్ గట్టి నిఘా పెట్టింది. అయితే అన్సారీ మృతిపై కుటుంబ సభ్యులు పోలీసులపై అనుమానాలు వ్యక్తం చేశారు. ఆయన కుమారుడు ఉమర్ అన్సారీ మాత్రం తన తండ్రికి 'స్లో పాయిజన్' ఇచ్చారని ఆరోపిస్తున్నారు. రెండురోజుల క్రితం తాను ఆయన్ను కలవడానికి వెళ్లినప్పుడు అనుమతించలేదని ఉమర్ చెప్పారు. అంతకుముందు ముక్తార్ సోదరుడైన ఘాజీపూర్ ఎంపీ అఫ్జల్ అన్సారీ సైతం ఇదే తరహాలో చెప్పారు.

మాజీ సీఎంపై సమోసా బాబా పోటీ

రాయ్‌పూర్: లోక్‌సభ ఎన్నికల్లో చిత్రవిచిత్రాలు చోటుచేసుకుంటున్నాయి. చత్తీస్‌గఢ్‌లో ఓ మాజీ సీఎంపై సమోసాలు అమ్మే వ్యక్తి పోటీ చేస్తున్నాడు. తాను గెలిస్తే వచ్చే జీతాన్ని ప్రజలకే ఖర్చు చేస్తానని ఆ సామాన్యుడు చెప్పాడు. చత్తీస్‌గఢ్‌లోని రాజ్‌నంద్‌గావ్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి మాజీ సీఎం భూపేశ్ బఘేల్ పోటీ చేస్తున్నారు. ఆయనపై అజయ్ పాలీ అనే సమోసాలు అమ్మే వ్యక్తి పోటీ చేసేందుకు సిద్ధమయ్యాడు. ఇందుకోసం నామినేషన్ పత్రాలు తీసుకున్నాడు. అజయ్ పాలీని స్థానికంగా సమోసా బాబా అని పిలుస్తారు. కవర్ధా జిల్లాలోని స్థానిక పోలీస్ స్టేషన్ ఎదురుగా అజయ్ పాలీ అలియాస్ సమోసా బాబా... గత 20 ఏళ్లుగా సమోసా దుకాణం నిర్వహిస్తున్నాడు. ప్రస్తుతం కవర్ధా జిల్లాలోని అనేక దుకాణాలకు హోల్‌సేల్‌గా సమోసాలు విక్రయిస్తున్నాడు. మొదట్లో ఒక సమోసాను 50 పైసలకు విక్రయించిన సమోసా బాబా... ప్రస్తుతం కవర్ధా నగరంలోని చాలా హోటళ్లకు తక్కువ ధరకు హోల్‌సేల్‌గా సమోసాలు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ప్రస్తుతం రూ.5కు ఒక సమోసా విక్రయిస్తున్న అజయ్ పాలీ దుకాణం ముందు జనం నిత్యం క్యూ కడుతూ ఉంటారు. ఈ సమోసా బాబా ఇప్పటివరకు 12కి పైగా ఎన్నికల్లో పోటీ చేశాడు. 2008 నుంచి వరుసగా పోటీ చేస్తున్నాడు.

కౌన్సిలర్ నుంచి ఎంపీ వరకు అన్ని ఎన్నికల్లో పోటీకి దిగాడు. ప్రస్తుతం రాజ్‌నంద్‌గావ్ లోక్‌సభ నుంచి నాలుగోసారి ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధమయ్యాడు. తాజాగా ఆయన రూ.25 వేలు వెచ్చించి లోక్‌సభ ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ ఫారం కొనుగోలు చేశాడు. ఇప్పటివరకు పోటీ చేసిన ఎన్నికల్లో ఓడిపోయినా... ఫలితాల గురించి పట్టించుకోకుండా సమోసా బాబా పోటీ చేస్తూ వస్తున్నారు. రాజ్‌నంద్‌గావ్ నియోజకవర్గ ప్రజలు... బీజేపీ, కాంగ్రెస్ పార్టీల పాలనను చూసి విసిగిపోయారని, ఈ ఎన్నికల్లో తనను గెలిపిస్తారని సమోసా బాబా ఆశాభావం వ్యక్తం చేశాడు.. పెద్ద పెద్ద నేతలు ప్రజా సమస్యలు పట్టించుకోరని సమోసా బాబా ఆరోపిస్తున్నాడు. తనను గెలిపిస్తే వచ్చే ఎంపీ జీతాన్ని ప్రజా సేవకు ఖర్చు చేస్తానని ప్రకటించాడు.

స్వయం ప్రతిపత్తి సంస్థల నిర్వీర్యం

ప్రజాస్వామ్యానికి హానికరం

జేవీ సత్యనారాయణ మూర్తి

విశాలాంధ్ర బ్యూరో-అనకాపల్లి: స్వయం ప్రతిపత్తి సంస్థల నిర్వీర్యం వల్ల పజాస్వామ్యానికి హానికరమని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణ మూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. కొండుగంటి గోవిందరావు జయంతి సందర్భంగా వై.విజయకుమార్ హాల్ శనివారం 'స్వయం ప్రతిపత్తి సంస్థల నిర్వీర్యం-పాలకుల పాత్ర-వాటి ప్రభావం' అనే అంశంపై సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వం స్వయం ప్రతిపత్తి సంస్థలను నిర్వీర్యం చేసిందన్నారు. పదేళ్ల మోదీ పాలనలో ఒక్క అధికార పార్టీ నేతపై కూడా ఈడీ, సీబీఐ దాడులు జరగలేదన్నారు. కేవలం విపక్షాల నేతలపైన, తమ దారికి రాని వ్యాపారవేత్తలపైన దాడులు చేయిస్తున్నారని ఆరోపించారు. కేజ్రీవాల్‌ను జైల్లో పెట్టిన తీరు చూసి గాలి జనార్ధన్ రెడ్డి బీజేపీలో చేరిపోయారంటే వారు ఎంతభయాందోళన కలిగిస్తున్నారో అర్థం చేసుకోవాలన్నారు. స్వయం ప్రతిపత్తి సంస్థలైన ఈడీ, సీబీఐ, ఎన్నికల కమిషన్‌ను తమ స్వార్థ ప్రయోజనాల కోసం మోదీ ప్రభుత్వం దుర్వినియోగం చేస్తుందన్నారు. ప్రజా ఉద్యమాల ద్వారా మాత్రమే స్వయం ప్రతిపత్తి సంస్థలను పరిరక్షణ చేసుకోవచ్చని స్పష్టం చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకట రమణ, జిల్లా సహాయ కార్యదర్శులు రాజాన దొరబాబు, ఎం.రాము నాయుడు, రెడ్డిపల్లి అప్పలరాజు, గురుబాబు, సుబ్బులక్ష్మి, నాగరాజు, తకాశి వెంకటేశ్వరరావు, కన్నబాబు, దేముడుబాబు, ఫణీంద్ర, బాబ్జీ, పోతురాజు, నారాలశెట్టి సత్యనారాయణ, సత్తిబాబు పాల్గొన్నారు.

చేనేత కుటుంబానికి న్యాయం చేయాలి

విశాలాంధ్ర-మంగళగిరి: రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం, భూబకాసురుల భూదాహానికి బలైన చేనేత కార్మికుడి కుటుంబానికి న్యాయం జరిగేవరకు పోరాడాలని జేవీ సత్యనారాయణ మూర్తి పిలుపునిచ్చారు. చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బుడిగే మాధవస్వామి అధ్యక్షతన జరిగిన ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వర్గ, సమితి సభ్యుల జూమ్ సమావేశంలో ఆయన ప్రసంగించారు. కడప జిల్లా ఒంటిమిట్ట మండలం కొత్త మాధవరం గ్రామానికి చెందిన పాల సుబ్బారావుకు తండ్రి నుంచి సంక్రమించిన మూడు ఎకరాల పది సెంట్ల భూమి ఉందని, రెవెన్యూ అధికారులు అదే గ్రామానికి చెందిన కట్టా శ్రావణి పేరుతో ఆ భూమిని ఆన్‌లైన్‌లో చేర్చడంతో తమ భూమి కబ్జాకు గురైందని తెలుసుకున్న సుబ్బారావు తన భూమిని తనకు అప్పగించాలని కాళ్లు అరిగేలా అధికారుల చుట్టూ తిరిగినా అధికారులు పట్టించుకోకపోవడంతో మనస్థాపంతో సుబ్బారావు, అతడి భార్య పద్మావతి, కుమార్తె వినయ ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ, సుబ్బారావు కుటుంబం ఆత్మహత్యకు కారకులైన రెవెన్యూ అధికారులపై క్రిమినల్ కేసు నమోదు చేసి సిట్టింగ్ న్యాయమూర్తిచే విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఆక్రమణదారుల చెరలో ఉన్న భూమిని తిరిగి సుబ్బారావు కుటుంబానికి అప్పగించాలని అన్నారు. మృతుడి పెద్ద కుమార్తెకు ప్రభుత్వ ఉద్యోగంతో పాటు రూ. కోటిన్నర ఎక్స్‌గ్రేషియా అందించాలని డిమాండ్ చేశారు.

2న మాధవరానికి...

ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రతినిధులు ఏప్రిల్ రెండున కొత్త మాధవరంనకు వెళ్లి సుబ్బారావు కుటుంబ సభ్యులను పరామర్శించి అధికారులకు వినతి పత్రాన్ని అందించాలని సమావేశం తీర్మానం చేసింది. పి.ధశరధరామయ్య, నీలి లక్ష్మయ్య, కట్టా హేమసుంధర రావు, కడుపు కన్నయ్య, గొట్టుముక్కల బాలాజీ, బి.వెంకట నారాయణ, వరప్రసాద్, వెంకట స్వామి, హరిబాబు, పీతాంబరధరరావు, జి.వెంకట కృష్ణారావు, జి.లక్ష్మి పాల్గొన్నారు.

పీవీకి భారతరత్న ప్రదానం

అందుకున్న కుమారుడు ప్రభాకరరావు

న్యూఢిల్లీ: ఢిల్లోని రాష్ట్రపతి భవన్‌లో భారతరత్న అవార్డుల ప్రదానోత్సవం శనివారం అట్టహాసంగా జరిగింది. ఈసారి కేంద్ర ప్రభుత్వం ఏకంగా ఐదుగురికి భారతరత్న ప్రకటించింది. భారతరత్న అవార్డు గ్రహీతలకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అవార్డుల ప్రదానం చేశారు. మాజీ ప్రధానమంత్రులు పీవీ నరసింహారావు, చౌదరీ చరణ్ సింగ్.. హరిత విప్లవ పితామహుడు, వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్, బీహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూరీ ఠాకూర్, బీజేపీ అగ్రనేత లాల్ కృష్ణ అద్వానీలను భారతరత్న వరించింది. వివిధ రంగాల్లో దేశానికి సేవలందించిన ఐదుగురు ప్రముఖులకు ఈ ఏడాది మూడు విడతల్లో భారతరత్న పురస్కారాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో నలుగురికి మరణానంతరం భారతరత్న ప్రకటించగా... వారి కుటుంబసభ్యులకు రాష్ట్రపతి పురస్కారాన్ని ప్రదానం చేశారు. దివంగత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు తరపున ఆయన కుమారుడు ప్రభాకర్‌రావు భారతరత్న పురస్కారాన్ని స్వీకరించారు. కర్పూరీ ఠాకూర్ తరపున ఆయన కుమారుడు రామ్‌నాథ్ భారతరత్న అందుకున్నారు. చౌదరీ చరణ్ సింగ్ తరపున ఆయన మనవడు జయంత్ సింగ్ పురస్కారం తీసుకున్నారు. ఎంఎస్ స్వామినాథన్ తరపున అవార్డును కుమార్తె నిత్యా రావు స్వీకరించారు. ఇక బీజేపీ అగ్రనేత ఎల్‌కే అద్వానీ ఈ కార్యక్రమానికి హాజరు కాలేదు. దీంతో రాష్ట్రపతి, ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం స్వయంగా ఆయన ఇంటికే వెళ్లి భారతరత్న ప్రదానం చేయనున్నారు. రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించిన భారతరత్న అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ప్రధాని మోదీ, కేంద్రమంత్రులు అమిత్ షా, జై శంకర్, కిషన్ రెడ్డి, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సహా ప్రముఖులు హాజరయ్యారు.

ఆ రైతులందరికీ జలకళ వర్తింపజేయాలి

• ఏపీ రైతు సంఘం డిమాండ్ • ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖ

విశాలాంధ్ర-విజయవాడ: బోర్లు వేయించుకోవటం కోసం దరఖాస్తు చేసుకున్న రైతులందరికీ జలకళ పథకం వర్తింపజేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్ చేసింది. ఇదే అంశమై ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డికి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ శనివారం లేఖ రాశారు. 2020 సెప్టెంబరు 28న అమల్లోకి వచ్చిన ఈ పథకం కింద రాష్ట్రంలో 2.40లక్షల మంది రైతులు దరఖాస్తు చేసుకుంటే కేవలం 23వేల బోర్లు వేశారని తెలిపారు. ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల్లో భూగర్భజలాలు అడుగంటి... బోర్లలో నీళ్లు లేక రైతులు ఆందోళనకు గురవు తున్నారని వెల్లడించారు. కొత్తగా బోరు వేసుకోవాలంటే వేలాది రూపాయలు ఖర్చు చేయాలని పేర్కొన్నారు. ఈ పథకంలోని నిబం ధనల ప్రకారం 200 అడుగుల లోతు బోరు మాత్రమే వేయాలని... భూగర్భ జలాలు తగ్గడంతో 800 అడుగులకుపైగా తవ్వి, బోర్లు వేస్తేనే రైతులకు ఉపయోగమని తన లేఖలో కేవీవీ ప్రసాద్ వివరించారు. ఈ నిబంధనను సవరించాలని ఆయన కోరారు. ఈ పథకం కింద బోర్లు వేసి... 3,500 మంది రైతులకు మాత్రమే విద్యుత్ మోటార్లు అమర్చారని గుర్తుచేశారు. బోర్లు వేసిన రైతులందరికీ విద్యుత్ సౌకర్యం కల్పించాలని కేవీవీ ప్రసాద్ కోరారు.

ఫుట్‌బాల్ మహిళా క్రీడాకారిణులపై లైంగిక వేధింపులు

ఏఐఎఫ్‌ఎఫ్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు దీపక్ శర్మపై ఫిర్యాదు

పనాజీ: ఆల్ ఇండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్ (ఏఐఎఫ్‌ఎఫ్) ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు దీపక్‌శర్మపై హిమాచల్‌ప్రదేశ్ ఖాద్ ఫుట్‌బాల్ క్లబ్‌కి చెందిన ఇద్దరు మహిళా క్రీడాకారిణులు తీవ్ర ఆరోపణలు చేశారు. గోవాలో ఇండియన్ ఉమెన్స్ లీగ్-2 జరుగుతుంది. ఈ సందర్భంగా హోటల్ గదిలో ఉన్న తమపై గురువారం రాత్రి దీపక్‌శర్మ లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని, భౌతికంగా దాడి చేశాడని ఆ క్రీడాకారిణులు ఏఐఎఫ్‌ఎఫ్‌కి శుక్రవారం ఫిర్యాదు చేశారు. హిమాచల్‌ప్రదేశ్ నుంచి గోవాకు వెళ్తుండగా తమ ముందే అతను మద్యం సేవించాడని చెప్పారు. బాధిత మహిళా క్రీడాకారిణుల్లో ఒకరైన పాలక్ వర్మ మీడియాతో మాట్లాడుతూ 'గురువారం రాత్రి 10.30-11 గంటల సమయంలో నేను గుడ్లు తెచ్చి నా రూమ్‌లో ఉన్న మరో అమ్మాయితో కలిసి ఫుడ్ ప్రిపేర్ చేస్తున్నాను. ఆ సమయంలో దీపక్ సార్ నన్ను తన రూమ్‌లోకి రమ్మని పిలిచారు. అప్పుడు నా బదులు నా రూమ్మేట్ సార్ గదికి వెళ్లి నేను ఫుడ్ ప్రిపేర్ చేస్తున్నానని చెప్పింది. అప్పుడు సార్ ఆ అమ్మాయిని తిట్టి నన్ను రమ్మని పిలిచాడు. వెంటనే సార్ గదికి నేను వెళితే నన్ను దుర్భాషలాడాడు. నువ్వెందుకు ఫుడ్ ప్రిపేర్ చేస్తున్నావ్? అని ప్రశ్నించాడు. దీంతో నేను ఏడవడం మొదలుపెట్టాను. వెంటనే నా గదిలోకి వచ్చాను. సార్ మళ్లీ నా రూమ్‌లోకి పరుగెత్తుకుంటూ వచ్చి నాపై శారీరకంగా దాడి చేశాడు. దీంతో నాతో ఉన్న నా రూమ్మేట్ బలవంతంగా అతన్ని ఆపింది. దీంతో అతను అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ఈ ఘటనతో క్లబ్ మేనేజర్ భార్య నందిత మా వద్దకు వచ్చింది. ఆమె మాపై మరింత ఒత్తిడి తెచ్చింది. మాకు సంస్కారం లేదని తిట్టింది. ఈ ఘటనతో భయపడి మేము జీఎఫ్‌ఏ (గోవా ఫుట్‌బాల్ అసోసియేషన్)కి, ఏఐఎఫ్‌ఎఫ్‌కి ఫిర్యాదు చేశాము. అయితే ఈ ఫిర్యాదును వెనక్కి తీసుకోమని మాపై ఒత్తిడి తెస్తున్నారు. ఈ ఘటన తర్వాత మాకు నిద్రపట్టలేదు. దీంతో మేము సరిగ్గా ఆడలేకపోయాము' అని అన్నారు. ఇక ఈ ఘటనకు సంబంధించి జీఎఫ్‌ఏ వైస్ ప్రెసిడెంట్ జోనాథన్ డిసౌజా మాట్లాడుతూ 'మాకు ఫిర్యాదు అందిన తర్వాత మేము మహిళల భద్రత దృష్ట్యా వెంటనే పోలీసులకు పంపాం' అని అన్నారు. ఏఐఎఫ్‌ఎఫ్ కమిటీ హెడ్ మిస్ వాలెంకా అలెమావో కూడా బాధిత క్రీడాకారిణులను కలిశారు. అమ్మాయిలకు న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నట్లు చెప్పారు. లైంగిక వేధింపులకు పాల్పడిన దీపక్ శర్మను గోవా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఫిర్యాదు మేరకు మపుసా పోలీస్ స్టేషన్‌లో విచారణకు పిలిచారు. అయితే ఈ ఘటనపై ఇప్పటివరకు ఏఐఎఫ్‌ఎఫ్ స్పందించలేదు. ప్రస్తుతం దీపక్‌శర్మ హిమాచల్ ప్రదేశ్ ఫుట్‌బాల్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ, ఏఐఎఫ్‌ఎఫ్ కాంపిటీషన్స్ కమిటీకి డిప్యూటీ ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు.

జగన్‌కు నిరసన సెగ

'సిద్ధం' యాత్రను అడ్డుకున్న జొన్నగిరి మహిళలు

పరిష్కారానికి సీఎం హామీ

విశాలాంధ్ర-తుగ్గలి: మేమంతా సిద్ధం బస్సు యాత్రలో సీఎం జగన్‌కు నిరసన సెగ తగిలింది. తమ తాగునీటి సమస్య పరిష్కరించాలంటూ కర్నూలు జిల్లా, తుగ్గలి మండలం, జొన్నగిరి గ్రామస్తులు డిమాండ్ చేశారు. బస్సు యాత్రను అడ్డుకున్నారు. తమ సమస్య తీరేదెప్పుడని సీఎంను నిలదీశారు. తాగేందుకు నీరు లేక ఇబ్బంది పడుతుంటే పట్టించుకునే నాయకుడే లేడని తీవ్ర ఆవేదన వ్యక్తంచేశారు. ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి దత్తత తీసుకున్న గ్రామానికి నీరు అందించలేకపోతే ఎలా అని ప్రశ్నించారు. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, వేసవిలో సమస్య మరింత పెరిగిందని తమ గోడును వినిపించారు. ఖాళీ బిందెలతో సీఎం బస్సును మహిళలు అడ్డుకోగా అప్రమత్తమైన పోలీసులు వారి నుంచి బిందెలు స్వాధీనం చేసుకున్నారు. ముఖ్యమంత్రి బస్సు దిగి వచ్చే వరకు మహిళలు ఊరుకోలేదు. సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని సీఎం చెప్పడంతో వారు శాంతించారు. దీంతో కాన్వాయ్ ముందుకు సాగింది.

పవన్ ఎన్నికల శంఖారావం ప్రారంభం

వర్మ త్యాగానికి ప్రాధాన్యత ఇస్తానని వెల్లడి

విశాలాంధ్ర బ్యూరో-కాకినాడ: కాకినాడ జిల్లా పిఠాపురం నుంచి జనసేనాని పవన్ కల్యాణ్ ఎన్నికల శంఖారావానికి శనివారం శ్రీకారం చుట్టారు. ఏప్రిల్ రెండో తేదీ వరకు పిఠాపురం నియోజకవర్గంలో ఆయన ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారు. తొలుత గొల్లప్రోలులో మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నేత ఎస్‌వీఎస్ వర్మ నివాసానికి పవన్ వెళ్లారు. హెలిపాడ్ వద్ద కాకినాడ జనసేన పార్లమెంట్ అభ్యర్థి ఉదయ శ్రీనివాస్, కాకినాడ రూరల్ జనసేన అభ్యర్థి పంతం నానాజీ, పెద్దాపురం జనసేన పార్టీ ఇన్‌చార్జ్ తుమ్మల బాబుతో పాటు పెద్ద సంఖ్యలో జనసైనికులు పవన్‌కు ఘనస్వాగతం పలికారు. అక్కడి నుంచి దొంత మూరుకు పవన్ రోడ్ షో నిర్వహించారు. దొంతమూరులోనూ పవన్‌కు ఘనస్వాగతం లభించింది. పవన్ కల్యాణ్ ఆత్మీయంగా వర్మను పలకరించి బొకే అందజేశారు. తెలుగుదేశం పార్టీ జిల్లా ఎన్నికల ఇన్‌ఛార్జి సుజయ కృష్ణ రంగారావు, వర్మతో కలిసి పవన్ గంటకు పైగా ఎన్నికల ప్రచారాంశాలు, వ్యూహంపై చర్చించినట్టు తెలుస్తోంది. అక్కడికి భారీ సంఖ్యలో చేరుకున్న వర్మ అభిమానులకు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలకు పవన్ అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ మీ అందరి ఆదరాభిమానాలు చూరగొన్న వర్మ...తన కోసం అసెంబ్లీ సీటు త్యాగం చేశారని, ఆ త్యాగాన్ని తాను ఎప్పుడు మర్చిపోలేనని, వర్మకు కూడా తాను అదేస్థాయిలో ప్రాధాన్యత ఇస్తానని చెప్పారు. వర్మ మాట్లాడుతూ పిఠాపురంలో పవన్ కల్యాణ్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపిస్తానన్నారు. ఆలయాల దర్శనం అనంతరం సాయంత్రం చేబ్రోలులో వారాహి విజయభేరి సభలో పవన్ కల్యాణ్ పాల్గొన్నారు.

రేపటి నుంచి అత్యవసర మందుల ధరలు పెరుగుదల

న్యూఢిల్లీ: ఇప్పటికే నిత్యావసరాల ధరలు పెరిగి కోలుకోలేకపోతోన్న సామాన్యులకు భారీ షాక్ తగలనుంది. ఏప్రిల్ 1 నుంచి పెయిన్ కిల్లర్లు, యాంటీ బయోటిక్స్, యాంటీ ఇన్‌ఫెక్టివ్ వంటి అత్యవసరమైన మందుల ధరలు పెరగనున్నాయి. ఈ మేరకు నేషనల్ లిస్ట్ ఆఫ్ ఎసెన్షియల్ మెడిసిన్స్ కింద ఉన్న మందుల ధరలను 0.0055 శాతం పెంచుతున్నట్లు ఎన్‌పీపీఏ వెల్లడించింది. ఇప్పటికే అత్యవసర మందుల ధరలు గత ఏడాది 10 శాతం పెరిగిన సంగతి విదితమే. 2022, 2023లో నేషనల్ లిస్ట్ ఆఫ్ ఎసెన్షియల్ మెడిసిన్స్ (ఎన్‌ఎల్‌ఈఎం) కింద ఔషధాల ధరలలో రికార్డు స్థాయిలో 12 శాతం నుంచి 10 శాతం పెరిగాయి. సవరించిన ధరలు జాతీయ అవసరమైన ఔషధాల జాబితాలో చేర్చబడిన 800 కంటె ఎక్కువ మందులను కవర్ చేస్తాయి. షెడ్యూల్ చేయబడిన ఔషధాల ధరలను సంవత్సరానికి ఒకసారి సవరించేందుకు అనుమతి ఉంది.





Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.